ఆదివారం
30-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 188
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చత్తీస్‌గఢ్‌లో ఆగని ఎన్‌కౌంటర్లు

17 మంది మావోయిస్టుల కాల్చివేత

- భారీగా ఆయుధాలు స్వాధీనం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

విశాలాంధ్ర-చింతూరు: దండకారణ్యంలో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో 11 మంది మహిళలు, 25 లక్షల రివార్డు గల దర్భా డివిజన్ కమిటీ నాయకుడు జగదీశ్ ఉన్నారు. స్థానిక గోగుండా కొండపై మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో 17 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాల్పులు చోటుచేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్ (డీఆర్‌జీ), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. గాయపడిన సిబ్బంది డీఆర్‌జీ విభాగానికి చెందిన వారిగా పేర్కొన్నారు. సంఘటనా స్థలం నుంచి 17 మృతదేహాలను, భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ మీడియాకు తెలిపారు. పెద్ద సంఖ్యలో

- మిగతా 2 లో

'ఎక్స్' అమ్మేశా: మస్క్

వాషింగ్టన్: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'ను అమ్మేసినట్లు అధినేత ఎలన్ మస్క్ ప్రకటించారు. చాట్ జీపీటీకి పోటీగా ప్రారంభిం చిన సొంత కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ 'ఎక్స్‌ఏఐ'కు 33 బిలియన్ల డాలర్లకు 'ఎక్స్'ను విక్రయించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో ప్రకటిం చారు. ఇందుకు సంబంధించిన లావాదేవీ మొత్తం స్టాక్ రూపంలో జరిగింద న్నారు. సంస్థ విలువ 80 బిలియన్ డాలర్లుగా నిర్ధరించినట్లు మస్క్ తెలిపారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను 44 బిలియన్ డాలర్లకు మస్క్ కొనుగోలు చేశారు. ఆపై సంస్థ పేరును 'ఎక్స్'గా... ట్విట్టర్ పిట్ట చిహ్నాన్ని కూడా 'ఎక్స్'గా మార్చేశారు. కంటెంట్ విషయంలోనూ మార్పులు చేశారు.

రూ.1000 కోట్లు దాటిన ఆస్తిపన్ను వసూళ్లు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 'వన్ టైమ్ సెటిల్‌మెంట్'కు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఆస్తిపన్ను వసూళ్లు రూ.వెయ్యి కోట్లు దాటిందని పురపాలక శాఖ తెలిపింది. జీహెచ్ఎంసీ తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించడంతో ఇప్పటివరకు రూ. 1,010 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలైనట్లు వెల్లడించింది. ఈ నెల 31 నాటికి ఆస్తిపన్ను

- మిగతా 2 లో

1న 'సబర్మతి'పై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం పునర్నిర్మాణంపై మహాత్మాగాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గాంధేయ వాదానికి విరుద్ధంగా గుజరాత్ ప్రభుత్వ ప్రతిపాదిత ప్రాజెక్టు ఉన్నట్లు ఆరోపించారు. తుషార్ పిటిషన్‌ను ఏప్రిల్ 1న సుప్రీం న్యాయమూర్తులు ఎంఎం సందేశ్, రాజేంద్ర బిందల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించ నుంది. కాగా, ఆశ్రమం రూపు రేఖలు మార్చేందుకు గుజరాత్ ప్రభుత్వం ప్రతిపాదించడాన్ని సవాల్ చేస్తూ ఆ రాష్ట్ర

- మిగతా 2 లో

మృత్యుఘోష

1,644కు మైన్మార్ మృతులు | **అంతకంతకూ పెరుగుతున్న సంఖ్య**

- శిథిలాల కింద అనేక మంది
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- స్వల్ప ప్రకంపనలతో జనం బిక్కుబిక్కు

బ్యాంకాక్: మైన్మార్‌లో పెను విపత్తు సంభవించింది. మృత్యు విలయం కొనసాగుతోంది. భారీ భూకంపం ధాటికి మైన్మార్‌లో వెయ్యి మందికి పైగా మృత్యువాత పడ్డారు. అనేక మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉన్నారు. దీంతో మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. మరోవైపు స్వల్ప ప్రకంపనలు వరుసగా సంభవిస్తుండటంతో ప్రజలు మరింతగా భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలను కాపాడటం కోసం సహాయక చర్యలు ముమ్మ రంగా సాగుతున్నాయి. శుక్రవారం 7.7 తీవ్రతతో సంభవించిన రెండు భారీ భూకంపాలు విధ్వంసాన్ని సృష్టించాయి. పక్కనే ఉన్న థాయి లాండ్‌నూ కుదిపివేశాయి. ఫలితంగా రెండు దేశాల్లో ప్రాణ-ఆస్తి నష్టం సంభవించింది. మృతుల సంఖ్య 1,644కు చేరుకోగా, 3,408 మందికి గాయాలయ్యాయని మైన్మార్‌లోని జుంటా ప్రభుత్వం శనివారం ప్రకటించింది. మరో 139 మంది జాడ లేరని తెలిపింది. శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయిన క్రమంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని

- మిగతా 2 లో

ప్రజావసరాలకు లింక్ రోడ్లు

- భవిష్యత్‌కు తగినట్లు విస్తరణ, నూతన నిర్మాణాలు
- హెచ్‌ఆర్‌డీసీఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

విశాలాంధ్ర- హైదరాబాద్: నగరంలో ప్రజావసరాలకు అనుగుణంగా అనుసంధాన (లింక్) రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దీంతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) అధ్వర్యంలో చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెంచడం, ప్రజలు ఎటువంటి అవాంతరాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం ఉండాలని సీఎం ఆదేశించారు. విశాల ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సీఎం అన్నారు. అనుసంధాన రహదారుల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణ విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. రహదారుల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వారికి సమయం కలిసి వచ్చేలా ఉండాలని, ఈ క్రమంలో అదనపు భూసేకరణకు కొంత అధిక వ్యయమైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పురపాలక, పట్టణభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి

- మిగతా 2 లో

సీవరేజ్ ప్లాంట్ పూర్తి చేయండి

- అన్ని ఇళ్లకు ఎస్టీపీ కనెక్షన్లు
- కళాశాల మైదానంలో చెత్తవేస్తే జరిమానా: మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: నల్లగొండ సమీపంలో శేషమ్మ గూడెం వద్ద చేపట్టిన సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ పనులను ఏప్రిల్ 25 నాటికి పూర్తిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి శనివారం సీవరేజ్ ప్లాంటును తనిఖీ చేశారు. 2014లో రూ.38 కోట్లతో ఈ ప్లాంట్ మంజూరైందని, ఇప్పటి వరకు పనులు పూర్తి కాకపోవడం బాధాకరమని అన్నారు. నల్లగొండ పట్టణంలో దాదాపు 80 శాతం ఇళ్లు

- మిగతా 2 లో

'గ్రీన్ పవర్' పెంపునకు
నిరంతరం కృషి

- హిమాచల్‌ప్రదేశ్‌తో హైడల్ విద్యుత్ ఒప్పందం ఓ ముందడుగు
- సహజవనరుల వినియోగంతో తక్కువ ధరకే కరెంట్
- ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకూ తోడ్పాటు: భట్టి

2 లో

ఆహార భద్రతకు పెద్దపీట

చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం, నిత్యావసరాలు
డీలర్ల కమీషన్ పెంపునకు యోచన: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సన్నబియ్యం పంపిణీ భారత దేశంలోనే విప్లవాత్మకమైన మార్పు అని పౌర సరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో ఆహారభద్రత కల్పించేందుకే ప్రభుత్వం ఇంతటి సాహసోపేత నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఉగాది రోజున హుజూర్ నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించ నున్న సన్నబియ్యం పథకం కార్యక్రమ ఏర్పాట్లను శనివారం ఆయన పర్యవేక్షించారు. భారీ బహిరంగ సభ విజయవంతానికి ఆయన కోదాడ, హుజుర్నగర్ నియోజకవర్గాలలో సుడిగాలి పర్యటన చేసి లీడర్, క్యాడర్ తో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాలలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు ఆహార

- మిగతా 2 లో

ఇదీ లోకం!



అబ్బో... అబ్బో..
మీకంతా రాజ పూజ్యమే!

పాల్వంచ మనుగడకు ఇబ్బంది లేదు

- కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తాం
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మనుగడకు ఎలాంటి అవరోధం ఉండదని, నియోజకవర్గ వ్యాప్తంగా సమగ్ర అభివృద్ధి జరుగుతుందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహిం చారు. కార్పొరేషన్ ఏర్పాటుపై కొందరు చేస్తున్న అవాస్తవాలపై కూనంనేని స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు. కావాలనే కొందరు అతిగా ఆలోచించి దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కార్పొరేషన్ వల్ల రోడ్డు, డ్రెయిన్లు లేని గల్లీలు ఉండవని తెలిపారు. పారిశ్రామిక

- మిగతా 2 లో

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 2
డా. అధికారి

మీరట్ కుట్ర కేసులో ఎస్.వి.ఘాటే జైలుకెళ్లిన తరవాత డా. గంగాధర్ అధికారి కమ్యూనిస్టు పార్టీ రెండవ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అధికారి మౌలికంగా సిద్ధాంతవేత్త. సోషలిజం, కమ్యూనిజం మీద ఆశాభావం, భవిష్యద్దర్శనానికి తోడు అంకితభావంగల కార్యకర్తలు, మేధావులు అండగా నిలవక పోతే భారత కమ్యూనిస్టు పార్టీ కూడా పశ్చిమ దేశాల కమ్యూనిస్టు పార్టీలలాగే చరిత్ర గర్భంలో కలిసిపోయేదేమో.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

టర్కీలో మిన్నంటిన ప్రజా నిరసన

ఇస్తాంబుల్‌లో భారీ ర్యాలీలు- ఇమాంగ్లు విడుదలకు డిమాండ్

ఇస్తాంబుల్: ఇస్తాంబుల్ మేయర్ అక్రమ్ ఇమాంగ్లు అరెస్టుకు నిరసనగా టర్కీ వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు కొనసాగుతున్నాయి. ఎర్డోగన్ ప్రభుత్వ తీరును నిరసనకారులు ముక్తకంఠంతో ఆక్షేపిస్తున్నారు. ఇస్తాంబుల్‌తో పాటు అనేక ప్రధాన ప్రాంతాల్లో భారీ నిరసనలతో ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్నది. ఇమాంగ్లును తక్షణమే బేషరతుగా విడుదల చేయాలన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది. అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగన్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నందునే ఇమాంగ్లును అవినీతి కేసులో ఇరికించారంటూ ఆరోపించారు. దశాబ్దంలో ఎన్నడూ జరగని విధంగా శనివారం పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతిపక్షాల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరిగిన ప్రదర్శనల్లో వేలాది మంది పాల్గొన్నారు. ఇమాంగ్లు విడుదలకు డిమాండ్ చేశారు. నిరసనలు శాంతియుతంగా జరిగినప్పటికీ దాదాపు రెండు వేల మందిని టర్కీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షం రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ (సీహెచ్‌పీ)తో పాటు ఇతర విపక్షాలు, హక్కుల సంఘాలు సంయుక్త పిలుపు మేరకు టర్కీ జెండాలు, బ్యానర్లతో జనం వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. ఇస్తాంబుల్‌లోని మాల్టేపే వద్ద 'ఇమాంగ్లుకు స్వేచ్ఛ' పేరిట సీహెచ్‌పీ అధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. 'న్యాయం మౌనం వహిస్తే, జనం గళం వినిపిస్తారు' అన్న బ్యానర్లు కనిపించాయి. ఇమాంగ్లు అరెస్టు తర్వాత టర్కీ ఆర్థికంగా కుదేలైంది. తాజా పరిణామాలు ప్రైవేటు రంగంలో ప్రకంపనలు సృష్టించాయి. అయితే ఇది తాత్కాలికమని, త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయని టర్కీ ప్రభుత్వం వివరణ ఇచ్చుకున్నది.

ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల సంఘీభావం

టర్కీ రాజకీయ అనిశ్చితి క్రమంలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ)కి, ఆ దేశ ప్రజలకు ప్రపంచ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి. నిరసనకారుల నిర్బంధకాండను ఖండించాయి. ఇస్తాంబుల్ మేయర్‌తో పాటు అరెస్టుకు గురైన ఆందోళనకారుల విడుదలకు డిమాండ్ చేశాయి. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ), పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఆస్ట్రియా (పీడీఏ), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ (పీసీటీఈ), పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ, పలస్తీనా కమ్యూనిస్ట్ యూత్ యూనియన్, ఇరాకీ కమ్యూనిస్టు పార్టీ, మెక్సికో కమ్యూనిస్టు పార్టీ (పీసీఎం), కెనడా కమ్యూనిస్టు పార్టీ, న్యూ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది నెథర్లాండ్స్ (ఎన్‌సీపీఎన్), డెన్మార్క్ కమ్యూనిస్టు పార్టీ, ఫ్రాంటే కమ్యూనిస్టా, జర్మన్ కమ్యూనిస్టు పార్టీ (డీకేపీ), సెర్బియా కమ్యూనిస్టు పార్టీ, రివల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఫ్రాన్స్ (పీసీఆర్ఎఫ్), తుడే పార్టీ ఆఫ్ ఇరాన్, లెబనీస్ కమ్యూనిస్టు పార్టీ (ఎల్‌సీపీ) తదితర పార్టీలు వేర్వేరుగా ప్రకటనల్లో టీకేపీకి సంఘీభావం తెలిపాయి. టర్కీలోని ఏకేపీ ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళుతూ, ఇస్తాంబుల్ మేయర్ అరెస్టుకు నిరసనగా ఆందోళనలు చేస్తున్న కమ్యూనిస్టులను, ప్రదర్శనకారులను నిర్బంధించడాన్ని ఆక్షేపించాయి. నిరంకుశత్వాన్ని ఆపాలని, అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. అంతర్జాతీయ సంఘీభావం వర్థిల్లాలని నినదించాయి. టర్కీ కమ్యూనిస్టు పార్టీకి, ప్రజలకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.

చత్తీస్‌గఢ్‌లో ఆగని ఎన్‌కౌంటర్లు

(మొదటిపేజీ తరువాయి)

ఏకే-47 రైఫిల్స్‌తోపాటు సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), ఇన్సాస్, రాకెట్ లాంచర్, బరెల్ గ్రనేడ్ లాంచర్ (బీజీఎల్)లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుండి 133 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుపెట్టినట్లు సుందర్ రాజ్ తెలిపారు. అందులో 117 మందిని ఒక్క బస్తర్ డివిజన్‌లో, 22 మంది సుక్మా జిల్లాలో కాల్చిచంపినట్లు తెలిపారు. చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సాయి, రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా... ఎన్‌కౌంటర్‌పై హర్షం వ్యక్తం చేశారు. శాంతి ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందని చెప్పారు.

మావోయిస్టుల బాంబుకు ఇద్దరు చిన్నారుల మృతి

చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలిన ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా... మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బీజాపూర్ పోలీసులు వెల్లడించారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే మార్గంలో మావోయిస్టులు గతంలో ఐఈడీ అమర్చారు. అడవిలో పండ్లు ఏరుకునేందుకు తన పిల్లలతో కలిసి వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి వస్తుండగా... అనుకోకుండా దానిపై కాలు వేయడంతో ఒక్కసారిగా అది పేలింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా... ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు ఆమెను దగ్గర్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రజావసరాలకు లింక్ రోడ్లు

(మొదటిపేజీ తరువాయి)

దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ ఉగాది శుభాకాంక్షలు

తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, వారి న్యాయమైన కోరికలు నెరవేరాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. ఉగాది రోజున రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు చాటేలా ప్రతి ఒక్కరు ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం కోరారు.

రూ.1000 కోట్లు దాటిన ఆస్తిపన్ను వసూళ్లు

(మొదటిపేజీ తరువాయి)

బకాయిలపై 10 శాతం వడ్డీ చెల్లించిన వారికి ఓటీఎస్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నెల 30, 31 సెలవు దినాలైనప్పటికీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లించవచ్చని తెలిపింది. రెండు రోజుల్లో ఆస్తిపన్ను చెల్లించి వడ్డీపై 90శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలని పురపాలక శాఖ సూచించింది.

ఆహార భద్రతకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

భద్రత కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ కలను రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చి ఆమె కల సాకారం చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు కోట్ల పది లక్షల మందికి ప్రయోజనం కలగ నున్నట్లు వివరించారు. అంటే రాష్ట్ర జనాభాలో సుమారు 84 శాతం మంది ప్రజలకు లబ్ది చేకూరనుందని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 4.41 లక్షల మంది రైతుల నుంచి 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. సన్నాలకు రూ. 500 బోనస్‌తో రాష్ట్రంలో సన్నాల దిగుబడి గణనీయంగా పెరిగిందన్నారు.రూ.1,199 కోట్లు బోనస్ రూపంలో రైతులకు చెల్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండగా 2.8 కోట్ల లబ్దిదారులు ఉన్నారన్నారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఈ నిర్ణయం మేరకు అదనంగా మరో 30 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. లబ్దిదారుల సంఖ్య 3.10 కోట్లకు చేరుకుంటుందన్నారు. చౌక ధరల దుకాణాలను కేవలం బియ్యానికే పరిమితం చేయకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామన్నారు. డీలర్లకు కమీషన్ పెంచుతామని చెప్పారు.

'సీవరేజ్ ప్లాంట్' పూర్తి చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఎస్టీపీ కనెక్షన్లు కలిగి ఉన్నాయని, లేని ఇళ్లకు ఎస్టీపీ కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. సీవరేజ్ ప్లాంట్ పూర్తి చేయడంతో పాటు, చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటించాలని, టైల్స్, పెయిం టింగ్ వంటి వాటన్నింటినీ ఏర్పాటు చేయాలని సూచించారు. నర్సప్పగూడ వద్ద ఇంకా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మరో ఎస్టీపీ నిర్మాణాన్ని చేపట్టనున్నామని తెలిపారు. ఎస్టీపీ నిర్మాణంలో కలెక్టర్‌తో పాటు, ప్రత్యేక అధికారి చొరవ తీసుకొని త్వరితగతన పూర్తి చేయాలని పునరుద్ఘాటిం చారు. ఎన్జీ కళాశాల మైదానంలో హరితహారం మొక్కలు నాటించాలని, గార్డెన్ ఏర్పాటు చేయాలని, కళాశాల మైదానంలో ఎవరు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త వేస్తే జరిమానా విధించాలని మున్సిపల్ అధికా రులను ఆదేశించారు. ఫ్లైఓవర్లకు పెయింటింగ్ వేయించాలని మున్సిపల్ కమిష నర్‌ను ఆదేశించారు. అనంతరం మంత్రి ఛాయా సోమేశ్వర దేవాలయం వెనక వైపు ఉన్న డైసింగ్ కుంట రోడ్డును, ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా పచ్చల సోమేశ్వర స్వామి దేవాలయానికి వాహనాల పార్కింగ్ అభివృద్ధి కై స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బ గోని రమేష్ గౌడ్, ఆర్డీవో అశోక్ రెడ్డి, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మంత్రి వెంట ఉన్నారు.

అమెరికాను వీడండి: విదేశీ విద్యార్థులకు ఈమెయిల్

వాషింగ్టన్: స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోండి అంటూ అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ ఈమెయిల్స్ పంపింది. 'బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వీసా' నుంచి విదేశీ విద్యార్థులకు ఈమెయిల్స్ వెళ్తున్నాయి. ఈమేరకు అమెరికా విదేశాంగశాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగశాఖ జల్లెడ పడుతోంది. ఈ క్రమంలో అక్కడి ఆందోళనల్లో పాల్గొన్న వారికే కాకుండా సంబంధిత దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న విద్యార్థులపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆయా విద్యార్థులకు తమంతట తాముగా అమెరికా నుంచి వెళ్లిపోవాలని సూచించింది. ఇలా హెచ్చరికలు అందిన వారిలో భారతీయ విద్యార్థులు కొందరు ఉన్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామంతో విద్యార్థులకు సామాజిక మాధ్యమాల వినియోగ స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛపై ఆందోళన వ్యక్తమవుతోంది. 'యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్, అమెరికా జాతీయచట్టంలోని సెక్షన్ 221 ప్రకారం.. మీ వీసా రద్దయింది' అంటూ స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్‌కు బాధ్యత వహించే అధికారులకు సమాచారం వెళ్లింది. హెచ్చరిక సందేశాలు వచ్చిన వారు స్వదేశాలకు తిరిగి వెళ్లేందుకు సీబీపీ హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని సూచించారు.

షేక్ హసీనాపై సీఐడీ కేసు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై సీఐడీ కేసు నమోదైంది. యూనస్ ప్రభుత్వాన్ని గద్దె దించే కుట్ర చేస్తున్నారంటూ హసీనాతోపాటు మరో 72 మందిపై కేసులు నమోదైనట్లు ఆ దేశ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఢాకా మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హసీనాపై కేసు నమోదైందని, కోర్టు ఆదేశాల మేరకు సీఐడీ విచారణ ప్రారంభించిందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. గతేడాది డిసెంబర్ 19న హసీనా ఆన్‌లైన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సీఐడీకి స్పష్టమైన సమాచారం ఉంది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా... భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే.

'గ్రీన్ పవర్' పెంపునకు నిరంతరం కృషి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని హిమాచల్ ప్రదేశ్‌తో 520 మెగావాట్ల హైడల్ విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సిమ్లాలో శనివారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుక్కు, అధికారులతో భట్టి విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భద్రతను పెంచుకునేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ప్రతిపాదిత ప్రాజెక్టులు సెలి (400 మెగావాట్లు), మేయర్ (120 మెగావాట్లు) స్వచ్ఛమైన, ఆర్థికంగా మేలైన, విశ్వసనీయమైన విద్యుత్‌ను పొందడంలో ఉపకరిస్తాయని అన్నారు. జల విద్యుత్ అత్యంత విశ్వసనీయమైన గ్రీన్ పవర్ అని, థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుందన్నారు. థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉండగా హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తుందని వివరించారు. హిమాచల్ ప్రదేశ్ హిమాలయ పరివాహక నదులతో నిండి ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో తొమ్మిది నుంచి 10 నెలల పాటు నిరంతరం హైడల్ పవర్ ఉత్పత్తికి అనువుగా ఉంటుందన్నారు. హిమాచల్‌తో పోలిస్తే దక్షిణ భారతదేశ నదులపై హైడల్ విద్యుత్ ఉత్పత్తి కాలం పరిమితంగా ఉంటుందని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా హిమాచల్ ప్రదేశ్ సహజ వనరులను వినియోగించుకుని తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, నమ్మకమైన, పర్యావరణహిత విద్యుత్‌ను అందించాలన్నదే లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టులను జెన్కో నామినేషన్ విధానంలో చేపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ పవర్ వాటాను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. విద్యుత్ ఒప్పందం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో తోడ్పాటును అందించడమే కాకుండా హిమాచల్‌ప్రదేశ్ హైడ్రో ఎలక్ట్రిక్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకి, జెన్కో హైడల్ డైరెక్టర్ సచ్చిదానంద, హిమాచల్ ప్రదేశ్ ఎనర్జీ డైరెక్టర్ రాకేశ్ ప్రజాపతి, హిమాచల్ ప్రదేశ్ స్పెషల్ సెక్రటరీ ఎనర్జీ అరిందం చౌదరి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

అందజేసిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర బ్యూరో-ములుగు: దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే వారికి సహాయ ఉపకరణాల పంపిణీ చేస్తున్నట్లు మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ములుగు జిల్లా, ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో శనివారం జిల్లా సంక్షేమ అధికారి కూచన శిరీష అధ్యక్షతన దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని సీతక్క ప్రారంభించారు. ములుగు జిల్లా దివ్యాంగుల కోసం నాలుగు చోట్ల ప్రత్యేకమైన శిబిరాలను గతంలో నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలను అందించినట్లు చెప్పారు. వైకల్యం ఉన్నా ధైర్యంగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలని దివ్యాంగుల్లో ధైర్యం నింపారు. దివ్యాంగులకు ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక వెబ్ సైట్‌ను ఏర్పాటు చేశామని, వివిధ రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్... ఉద్యోగాల్లో నాలుగు శాతం కోటా అందించే దిశగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. చిరు వ్యాపారం చేసుకునే వీలుగా రుణాలను దివ్యాంగులకు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ చేయూతను సద్వినియోగించుకోవాలని దివ్యాంగులకు మంత్రి సీతక్క సూచించారు. తొలుత సీతక్క ప్రత్యేక చొరవతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు గతంలో ములుగు, పస్రా, ఏటూరు నాగారం, కన్నాయిగూడెంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులను తీసుకున్నట్లు అధికారి కూచన శిరీష తెలిపారు.

అర్హులైన 467 మందిని గుర్తించి, వారికి రూ.63 లక్షలతో 857 పరికరాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. జనవరిలో ములుగు, దాని పరిసర ప్రాంతాలలో అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించగా, ఈ రోజు గోవిందరావుపేట, ఎస్ఎస్ తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం, మండలాల లబ్ధిదారులకు సహాయ ఉపకరణాలను అందించినట్లు తెలిపారు. 297 మందికి రూ.40 లక్షలు విలువచేసే 525 ఉపకరణాలు అందించామన్నారు. అలింకో సంస్థ - హైదరాబాద్ వారి సహకారంతో 'సామాజిక అధికారితా శివిర్'లో దివ్యాంగులకు రెట్రో ఫిట్టెడ్ ట్రై సైకిళ్లు, చేతితో నడిపే ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల స్కూటర్లు, వివిధ రకాల చేతికర్రలు మొదలగునవి భాగంగా అందించినట్లు అధికారి తెలిపారు. అనంతరం దివ్యాంగులతో కలసి మంత్రి, కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో వెంకటేశ్, ఏటూరునాగారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ప్రేమలత, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

దలేవాల్ దీక్ష విరమించలేదు

- అరెస్టయిన రైతులందరినీ విడుదల చేయాల్సిందే
- రైతు నాయకుడు అభిమన్యు కోహర్

చండీగఢ్: గతవారం రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్న రైతులను జైళ్ల నుంచి విడుదల చేసిన తర్వాత పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దలేవాల్ ఒక గ్లాసు నీరు తాగినప్పటికీ... తన నిరవధిక నిరాహార దీక్ష విరమించలేదని రైతు నాయకుడు అభిమన్యు కోహర్ శనివారం తెలిపారు. దలేవాల్ నీటిని అంగీకరించి నిరాహార దీక్ష విరమించారని పంజాబ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. పంజాబ్ ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చుతూ...రైతులందరినీ విడుదల చేసిన తర్వాతే తాను నీటిని తీసుకుంటానని దలేవాల్ స్పష్టం చేసినట్లు కోహర్ చెప్పారు. 'రైతు నాయకులను విడుదల చేసిన తర్వాత దలేవాల్ ఒక గ్లాసు నీరు తాగారు' అని దలేవాల్ సన్నిహితుడు కోహర్ అన్నారు. 'దలేవాల్ తన నిరవధిక నిరాహార దీక్ష ముగించినట్లు తప్పుడు అభిప్రాయం ఇస్తున్నారని మేము స్పష్టం చేయాలనుకుంటున్నాం. ఆయన నిరాహార దీక్ష కొనసాగుతోంది' అని అన్నారు. ఖనౌరీ, శంభు సరిహద్దు పాయింట్ల వద్ద నిరసన చేస్తున్న రైతులను మార్చి 19న చెదరగొట్టామని, ధర్నా కారణంగా మూసుకుపోయిన రహదారులు తెరిచామని పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ శుక్రవారం సుప్రీం కోర్టుకు వివరించారు. మరో రైతు నాయకుడు కాకాసింగ్ కొట్రా మాట్లాడుతూ రైతులను నిర్బంధించిన విషయం దలేవాల్‌కు తెలియగానే, వారందరినీ విడుదల చేసే వరకు నీటిని తీసుకోవడానికి నిరాకరించారు. రైతులను విడుదల చేసిన తర్వాతే నీళ్లు తాగుతానని చెప్పారని కొట్రా అన్నారు. దలేవాల్ (70) సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ఉమ్మడి ఫోరమ్‌లో సీనియర్ నాయకుడు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందించడానికి చట్టపరమైన హామీ సహా తమ డిమాండ్లు ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి చేసేందుకు ఆయన గత ఏడాది నవంబరు 26న నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. జనవరిలో కేంద్రం రైతు నాయకులను చర్చలకు ఆహ్వానించిన తర్వాత దలేవాల్ ఖనౌరీ నిరసన ప్రదేశంలో వైద్య సహాయం తీసుకోవడం ప్రారంభించాడు. కానీ తన నిరాహార దీక్ష విరమించలేదు. మార్చి 19న పోలీసు నిర్బంధించిన సర్వన్ సింగ్ పంధేర్, అభిమన్యు కోహర్, కాకా సింగ్ కొట్రా సహా అనేక మంది రైతు నాయకులు శుక్రవారం విడుదలయ్యారు. కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు పంధేర్‌ను ముక్త్‌సర్ జైలు నుంచి విడుదల చేయగా కోహర్, కొట్రా, మరికొందరు రైతు నాయకులు పటియాలా సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.

నేపాల్ ఉద్రిక్తం

ఖాట్మండు: రాచరిక పాలన కోసం నేపాల్ ప్రజలు ఆందోళనకు దిగారు. మాజీ రాజు జ్ఞానేంద్ర షా మద్దతుదారులు రోడ్లపైకి వచ్చారు. దీంతో హింస జరిగింది. ఈ క్రమంలో 100 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రాజధాని ఖాట్మండులోని కొన్ని ప్రాంతాల్లో రాచరిక అనుకూల నిరసనకారులు రెచ్చిపోయారు. ఒక పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. టీవీ ఆఫీసు, పత్రికా కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. రాళ్లు రువ్వారు, వాహనాలకు నిప్పుపెట్టారు. దుకాణాలను దోచుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొనగా, హింసలో ఇద్దరు చనిపోయారు. 112 మంది గాయపడ్డారు. ఈ క్రమంలో సైన్యం రంగంలోకి దిగింది. 2008లో నేపాల్‌లో రాచరికం అంతమైంది. కాగా, ఫిబ్రవరి 19న ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా జ్ఞానేంద్ర తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తూ వీడియో సందేశం ఇవ్వడం ఆందోళనలకు దారితీసింది.

మృత్యుఘోష

(మొదటిపేజీ తరువాయి)



వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపింది. అటు థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లోనూ 6.7 తీవ్రతతో భూకంపం రాగా 10 మంది మరణించారు. నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భారీ భవంతి పేకమేడలా కూలి 100 మంది కూలీలు శిథిలాల కింద చిక్కుకుపోయారు. 26 మంది గాయపడ్డారు. సాధ్యమైనన్ని ప్రాణాలు కాపాడేందుకు శ్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలావుంటే, మృతుల సంఖ్య 10 వేలు దాటవచ్చని అమెరికా ఏజెన్సీ హెచ్చరించింది.

మళ్లీ 5.1 తీవ్రతతో ప్రకంపనలు...

మైన్మార్‌లో మళ్లీ భూ ప్రకంపనలు సంభవించాయి. శనివారం 5.1 తీవ్రతతో భూమి కంపించింది. రాజధాని నే పీ దాలో మధ్యాహ్నం 2.50 గంటలకు 10 కిమీల లోతులో భూ ప్రకంపనలు సంభవించినట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) తెలిపింది. తెల్లవారుజామున 4.7 తీవ్రతతో భూమి కంపించినట్లు తెలుస్తోంది. శుక్రవారం భారీ భూకంకం వచ్చిన ప్రాంతంలో తాజా ప్రకంపనలతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. మొత్తంగా 12 స్వల్ప ప్రకంపలు సగాయింగ్ వద్ద సంభవించాయని తెలుస్తోంది. మాండలే, బాగో, మగ్వే, షాన్, సగాయింగ్, నే పీ దాలో భారీగా నష్టం సంభవించినట్లు జిన్హువా వెల్లడించింది. మాండలేలోని అపార్ట్‌మెంట్ కుప్పకూలిన ఘటనలో 90 మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు రెడ్ క్రాస్ అధికారులు తెలిపారు. శుక్రవారం నేలమట్టం అయిన భవంతుల్లో స్కై విల్లే కండోమియం ఉన్నది. తొమ్మిది మంది చనిపోగా, 44 మందిని సురక్షితంగా కాపాడారని అల్ జజీరా తెలిపింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడటంతో కోసం క్షణం వృథా చేయకుండా సహాయక సిబ్బంది శ్రమిస్తున్నారని అక్కడి అధికారులు వెల్లడించినట్లు వార్తా సంస్థ నివేదించింది. భూకంపం ధాటికి వందల భవనాలు నేలమట్టం కాగా ప్రార్థనాలయాలు, మఠాలు శిథిలమైన విషయం విదితమే.

అఫ్ఘాన్‌లోనూ...

అఫ్ఘానిస్థాన్‌లోనూ భూ ప్రకంపనలు సంభవించాయి. నాలుగు సార్లకుపైగా భూమి కంపించింది. తెల్లవారుజామున 4.51 నిమిషాలకు 4.3 తీవ్రతతో, 5.16 గంటలకు 4.7 తీవ్రతతో భూకంపాలు నమోదయ్యాయి. భూకంప కేంద్రాన్ని కాబూల్‌కు 280 కిమీల దూరంలో 180 కిమీల లోతులో గుర్తించినట్లు జాతీయ భూకంప కేంద్రం వెల్లడించింది.

ఆపన్నహస్తం

మైన్మార్‌కు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం అందించాయి. చైనా 100 మిలియన్ యువాన్‌లు అంటే 13.77 మిలియన్ డాలర్ల విలువు చేసే సహాయాన్ని అందిస్తున్నట్లు ఆ దేశ రాయబార కార్యాలయం తెలిపింది. గుడారాలు, దుప్పట్లు, అత్యవసర వైద్య పరికరాలు, ఆహారం, తాగునీరు, నిత్యావసరాలతో కూడిన సహాయాన్ని 31వ తేదీ నాటికి మైన్మార్ చేరుస్తామని చైనా రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నది. అలాగే, దక్షిణ కొరియా రెండు మిలియన్ల విలువైన మానవతా సహాయాన్ని అందించింది. ఐక్యరాజ్య సమితి (ఐరాస)తో పాటు అమెరికా, రష్యా, సింగపూర్, భారత్ తదితర దేశాలు కూడా సాయాన్ని అందించాయి.

1న 'సబర్మతి'పై సుప్రీం విచారణ

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టును 2022, సెప్టెంబరు 8న తుషార్ ఆశ్రయించారు. అయితే ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39కు వ్యతిరేకంగా గుజరాత్ ప్రభుత్వ పిటిషన్ ఉన్నట్లు పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. శబర్మతి ఆశ్రమాన్ని భారీ పెట్టుబడులతో థీమ్ పార్కుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని, ఇది గాంధీ సిద్ధాంతాలు, బోధనలను హేళన చేయడమేనని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కార్యకలాపాలను నిలిపివేయాలని కోర్టును కోరారు. చారిత్రక సబర్మతి ఆశ్రమాన్ని పరిరక్షించడం భారత్ కర్తవ్యమని పిటిషన్ పేర్కొంది.

పాల్వంచ మనుగడకు ఇబ్బంది లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతమైన నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రయోజనాల కోసం, బహుముఖ అభివృద్ధి కోసం తాను కట్టుబడి ఉన్నానని అన్నారు. రూ.50 కోట్లతో పాల్వంచలో అమృత ఎడ్యుకేషన్ అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కేంద్రీయ విద్యాలయం కూడా ఏర్పాటు కానుందని అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి మోడల్ స్కూల్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎంబీఏ, బీసీఏ, బీబీఏ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు అవకాశం ఏర్పడుతుందని కూనంనేని చెప్పారు. రుద్రంపూర్‌లో ఉన్న ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఆధునీకరణ జరుగుతుందని, కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం రూ.3.90 కోట్లతో కొత్త భవన నిర్మాణం జరుగుతోందని అన్నారు. పాల్వంచ, కొత్తగూడెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు రూ.4 కోట్లు చొప్పున మంజూరు చేశామన్నారు. సుజాతనగర్‌లో కొత్తగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసినట్లు తెలిపారు. ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం రూ.100 కోట్లు మంజూరు కానున్నాయన్నారు. పాల్వంచ, కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రులలో డయాలసిస్ పేషెంట్లకు అదనంగా 10 యూనిట్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పాల్వంచలోని ఆసుపత్రికి కొత్త భవనం నిర్మిస్తున్నామని, ఇందులో ఎమ్మారై, సిటీ స్కాన్ మిషన్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియోజవర్గంలో ప్రతి ఎకరానికి నీరు అందించేందుకు ప్రణాళికి సిద్ధం చేస్తున్నట్లు కూనంనేని తెలిపారు. నియోజకవర్గంలో జూ పార్కు కోసం కృషి జరుగుతుందన్నారు. విమానాశ్రయం కూడా తప్పకుండా వస్తుందని, కొత్తగూడెం రింగ్ రోడ్డు కోసం రూ.500 కోట్లకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలో నిధులు వస్తాయన్నారు. రూ.158 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో సేతు బంధు ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు ఆయన వివరించారు. ఐటీ, ఇండస్ట్రియల్ హబ్, ఆటోనగర్ ఏర్పాటుకు కృషి జరుగుతుందన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు లింక్ రోడ్లు, బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తామని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించి తీరుతానని, ఎవరూ అనవసరమైన అపోహలకు గురి కావద్దని, కొత్తగూడెం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టిలో ఉందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేసిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఐటీడీఏ ఏటూరు నాగారం సమావేశ మందిరంలో శనివారం ఏటూరు నాగారం మండల పరిధి లోని 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కులను, ఏటూరు నాగారం లోని చైతన్య మండల సమాఖ్య మహిళ సంఘం సభ్యులకు రూ. 86,12, 641.00 విలువ గల చెక్కును, నందిని మహిళ పొదుపు సంఘం సభ్యులకు రూ. లక్ష 50వేల చెక్కును రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావులతో కలిసి పంపిణీ చేశారు.

మంత్రివర్గంలో రామచంద్రనాయక్‌కు అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర- దంతాలపల్లి: విద్యావంతుడు, స్నేహశీలి, మృదుస్వభావి నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు డాక్టర్ రామచంద్రనాయక్ 10 సంవత్సరాలు పార్టీ కోసం కష్టపడి గ్రామ గ్రామన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసిన నాయకుడని యూత్ కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి ఆవుల సురేష్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం అయినా మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజల కష్టాలను దగ్గరుండి చూసిన నాయకుడని మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ రాజకీయ వ్యవస్థను మార్చాలని ఉద్దేశంతో యువతకు ప్రాధాన్య ఇచ్చిన నాయకుడు32 లక్షల మంది ఉన్న లంబాడ జాతికి న్యాయం జరగాలంటే నిత్యం జాతి ప్రయోజనాల కోసం కృషి చేసే నాయకుడు డాక్టర్ రామచంద్రనాయక్ మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు అన్నారు. విద్యా వైద్యం ఆర్థిక అన్ని రంగాల మీనా విశేష అవగాహన కలిగిన నాయకుడు డాక్టర్ రామచంద్రనాయక్ మంత్రి పదవి ఇవ్వాలని మల్లికార్జున కర్గేను, సోనియా గాంధీని, రాహుల్ గాంధీని, సీఎం రేవంత్ రెడ్డిలను ఆయన కోరారు.

గడువు పొడిగించాలి : సిపిఐ

విశాలాంధ్ర - వనపర్తి : యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎమ్మార్వో ఆఫీసుల్లో ఇన్కమ్, క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం, పండగ సెలవుల కారణంగా గడువును పొడిగించాలని సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ కోరారు. శనివారం సిపిఐ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువత స్వయం ఉపాధికి యువ వికాస పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టడం హర్షినియమన్నారు. అయితే దరఖాస్తుకు చివరి గడువు ఏప్రిల్ 5వ తేదీ పెట్టారన్నారు. యువ వికాస పథకానికి దరఖాస్తు చేసే అభ్యర్థులు, రేషన్ కార్డ్ లేదా ఆదాయం సర్టిఫికెట్ జత చేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టిందన్నారు. కొత్త రేషన్ కార్డులను ఇవ్వని కారణంగా చాలామంది అభ్యర్థులకు రేషన్ కార్డులు లేవన్నారు. ఆదాయం సర్టిఫికెట్ ఎమ్మార్వో ఆఫీస్ నుంచి తీసుకోవాలని, సాంకేతిక కారణం వల్ల వనపర్తి ఎమ్మార్వో ఆఫీస్ లలో ప్రభుత్వ సైట్ పనిచేయక సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వటం లేదన్నారు. వనపర్తి ఎమ్మార్వో ఆఫీస్‌లో గత మూడు రోజులుగా సైట్ పనిచేయక వెయ్యి దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. కుండల తయారీ, తట్టలు పొరకల తయారీ తదితర వ్యాపారాలు వికాస పథకం స్కీం లో పెట్టలేదని, పెట్టాలన్నారు. గతంలో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసిన కొందరికి రుణాలు రాలేదన్నారు. కానీ వారి పేర్లు ఆన్లైన్లో ఉన్నాయని, దరఖాస్తు చేసుకునేందుకు వెళితే ఆన్లైన్ యాక్సెప్ట్ చేయడం లేదని, సమస్య పరిష్కరించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, గోపాలకృష్ణ, పృథ్వీ నాదం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశి, ప్రసాద్, సిపిఐ సీనియర్ సీనియర్ నేత చిన్న కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది : ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని పేదలకు నిస్వార్థమైన సేవలందించినప్పుడే వైద్యులను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ మురళీధర్ సేవలందించి పదవీ విరమణ చేస్తున్న సన్మానోత్సవానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి డాక్టర్ మురళీధర్ అంచలంచలుగా ఎదిగి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా సేవలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. మరొక ఆత్మీయ అతిథి రాష్ట్ర ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్, పదవి విరమణ మహోత్సవానికి వచ్చి ఘనంగా సన్మానించి మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అని పేర్కొంటూ మురళీధర్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. పూర్వం ఈ జిల్లాలో వైద్యాధికారులుగా పని చేసిన డాక్టర్ హరీష్ రాజ్, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ అంబరీష్, డాక్టర్ కళావతి భాయ్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ డాక్టర్ సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, డిప్యూటీ డెమో ప్రసాద్, కేవి రాజు, పురుషోత్తం, శారద, గీతా హెల్త్ ఎడ్యుకేటర్లు, శ్రీనివాస్ సబ్ యూనిట్ ఆఫీసర్, రామకృష్ణ సబ్ యూనిట్ ఆఫీసర్, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి ఉద్యమం చేపట్టాలి

విశాలాంధ్ర - కారేపల్లి : మహానుభావుల ఆశయ సాధనతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని దేశంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సాధించే విధంగా ప్రయత్నం చేయాలని వైరా శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వా ళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కారేపల్లిలో ఏఐసిసి దేశవ్యాప్త పిలుపులో భాగంగా టిపిసిసి పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం మండల కాంగ్రెస్ అధ్యక్షులు తలారి చంద్ర ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్‌తో కలిసి వారు మాట్లాడుతూ భారత దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ చేయబడి అరాచాకుల పాలన సాగుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ జరగాలంటే క్షేత్రస్థాయిలో ఆనాడు స్వతంత్ర ఉద్యమంలో ఎలా అయితే కంకణ బద్ధులై దేశాన్ని సాధించుకున్నారో అదేవిధంగా దేశ నిర్మాణంలో ప్రజాస్వామ్య బద్దంగా ప్రభుత్వం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రజలను చైతన్య పరుస్తూ కాంగ్రెస్ పార్టీ గత స్వాతంత్ర ఉద్యమం లాగా నేడు గ్రామ గ్రామాన గాంధీ సిద్ధాంతాన్ని అనుకరిస్తూ ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల మాజీ ఎంపీపీ బానోతు దేవలానాయక్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు ఇమ్మడి తిరుపతిరావుతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ

మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : హుజూర్ నగర్ పట్టణంలో నేడు జరిగే సీఎం పర్యటనను విజయ వంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. గతంలో ఇచ్చే రేషన్ (దొడ్డు) బియ్యం 70 నుండి 80 శాతం ప్రజలు తినడంలేదన్నారు. రాష్ట్రంలో 85% జనాభా కడుపునిండా ఆహారం అందించే విధంగా ప్రతి నెల ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, జన సమీకరణ చేయాలని కోరారు. నేరేడుచర్ల, పాలక వీడు, గరిడేపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన వెంకట్ రెడ్డి, సుబ్బారావు, అంజి రెడ్డి, పట్టణ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మీ నరసింహరావు, జిల్లా కాంగ్రెస్ నాయ కులు చలసాని శ్రీనివాస్‌రావు, మాజీ జడ్పీటీసీ, రాపోలు నరసయ్య, మాజీ ఎంపీపీ గోపాల్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, మోతీలాల్, నాగయ్య, జితేందర్ రెడ్డి, సత్యనారాయణ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఉగాది పర్వదినాన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : ఉగాది పర్వదినం నాడు ఖమ్మం జిల్లాలో నూతన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయ చేయబోతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఖమ్మం ప్రజలకు, పాత్రికేయులకు, రైతాంగ సోదరులకు తెలుగు నూతన నామ సంవత్సర ఉగాది పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖమ్మం జిల్లా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రధాన ప్రాజెక్టు సీతారామ ఎత్తిపోతల పథకం క్రింద 600 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు పూర్తి చేసి 101 కిమి కాల్వలో నీరు తీసుకొని వచ్చామని, ఆరు నెలల వ్యవధి కాలంలో 1500 క్యూసెక్కుల పరిమాణంతో రాజీవ్ కెనాల్ 9 కిలోమీటర్ల మేరకు పూర్తి చేసి సాగర్ కాల్వకు లింక్ చేసి, మొన్న సాగునీరు ఇబ్బందులు వచ్చినప్పుడు వైరా, తల్లాడ, పెనుబల్లి వెంసూర్ మండలాలతో పాటు ఎగువన పినపాక, కొత్తగూడెం, అశ్వరావుపేట నియోజకవర్గాల్లోని పంటలు కూడా కాపాడుకోవడం జరిగిందన్నారు. అమరావతి- భద్రాచలం జాతీయ రహదారి పనులు పూర్తి చేసుకున్నామని, హైదరాబాద్ - ఇల్లెందు - భద్రాచలం జాతీయ రహదారి పనులు వేగంగా జరుగు తున్నాయని, భద్రాచలం- ఏటూరు నాగారం మీదుగా మహారాష్ట్రకు కూడా జాతీయ రహదారి వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డుగా పూర్తి చేస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డిఓ నరసింహరావు, నేషనల్ హై వే మేనేజర్ దివ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు ఎస్.పి. ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, రహదారి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రహదారులపై ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించేలా అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని జిల్లాలో ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు...

విశాలాంధ్ర - కారేపల్లి : ప్రేమ అనురాగాల సమ్మేళనమే పవిత్ర రంజాన్ పండుగ అని అలాంటి పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత మత సమరయస్యానికి ప్రతీకని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం కారేపల్లిలోని జామే మసీద్ లో మండలానికి చెందిన ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ముందుగా మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జామే మసీద్ కమిటీ సభ్యులతో పాటు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలందరిని చేర్చేలా కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలందరిని చేర్చేలా కృషి చేయాలనీ, బడిబాట కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సహకరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు కోరారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశమందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ క్రాంతి వల్లూరు అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, పాల్గొని జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరును సమీక్షించారు. సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ, వెనుకబడిన తరగతుల, గిరిజన, దళిత వర్గాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ, వెనుకబడిన తరగతుల, గిరిజన, దళిత వర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవ్ రావు, జిల్లా సాంఘికసంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లావెనుకబడినతరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఆర్డీఓలు, డీస్పీలు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పండుగా సంబరాలు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : జడ్పీ ఉన్నత పాఠశాల కమలాపురం పాఠశాలలో ఘనంగా ఉగాది, రంజాన్ వేడుకాలు నిర్వహించిన్నట్లు, పాఠశాల శాల హెడు మాస్టర్ గడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూపాఠశాల లో ఉగాది పర్వదిన సందర్బంగా విద్యార్థులు ఉగాది పచ్చడి సేమ్యా తయారు చేసి అందరికి అందించిన్నట్లు, జీవితం లో కష్టసుఖాలు, బాధ రోగాలు ఎన్ని వచ్చిన దైర్యంగా ఎదుర్కోవాలని, వాటికి గుర్తు గానే ఉగాది పచ్చడిలో తీపి పులుపు వేప పువ్వు కారం ఉప్పు వంటి షేడరుచులు ఉంటాయని పేర్కొంటూ విద్యార్థులు అందరికి రంజాన్ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు నర్సింహా రావ్, నాగమ్మ, నాగలక్ష్మీ, నరేష్, మౌలాలి, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా

విశాలాంధ్ర - తొర్రూరు : గుడుంబా దాడులలో పట్టుబడి బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ. 50 వేలు జరిమానా విధించినట్లు ఎక్సైజ్ ఇన్చార్జ్ రాజేశుని ప్రవీణ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు తొర్రూరు ఎక్సైజ్ పరిధిలోని నెల్లికుదురు మండలం రాజుల కొత్తపల్లి గ్రామానికి చెందిన పేరుమాండ్ల సుజాత భర్త వీరస్వామి గతంలో గుడుంబా దాడులలో పట్టుబడగా వారిని ఎక్సైజ్ అధికారులు స్థానిక తహసీల్దారుల ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి అదే తరహాలో గుడుంబా తయారీ జరుగుతుండడంతో ఎక్సైజ్ అధికారులు బ్రీచ్ కేసులు నమోదు చేసి నర్సంపేట్ జిల్లా జైలుకు రిమాండ్ చేయగా రూ. 50 వేల జరిమానా కట్టించడం జరిగింది. శనివారం ప్రవీణ్ మాట్లాడుతూ నాటు సారాయి తయారీ రవాణా చేసిన నేరమని, నల్ల బెల్లం రవాణా చేసిన అమ్మడం కొనడం జరిగిన చట్ట విరుద్ధమని అన్నారు. గ్రామాలలో గుడుంబా నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ఎం. రవళి రెడ్డి, ఎస్.శంకర్, ఎక్సైస్ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డైరీ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టరేట్లోని తన చాంబర్లో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వారి డైరీని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా కలెక్టర్ అసోసియేషన్ బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాబురావు, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు పుష్ప పాల్గొన్నారు.

క్రీడలలో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర - వనపర్తి : పెద్ద మందడి మండలం, పామిరెడ్డిపల్లి గ్రామం ఎస్లో పామిరెడ్డిపల్లి ప్రీమియర్ లీగ్‌ను ఉగాది, రంజాన్ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఇట్టి టోర్నమెంట్‌కు మొదటి బహుమతి 20,000 మాజీ మంత్రి సింగిరెడ్డి రెడ్డి నిరంజన్ రెడ్డి ఇచ్చారు. ద్వితీయ బహుమతి 10,000, తృతీయ బహుమతి 5,000 ఎమ్.మన్నెపు రెడ్డి ఇచ్చారు. మాజీ మంత్రి వెంట పామిరెడ్డిపల్లి గ్రామానికి, చెందిన బీఆర్ఎస్ నాయకులు మన్నెపురెడ్డి, మాజీ ఎంపీపీ, రవిచందర్‌రావు, సందడి.గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, నాగేందర్‌రావు, వడ్డే వెంకటయ్య, కావలి వెంకట రాములు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ట్రాన్స్‌జెండర్ల నిరసన

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి : శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు ట్రాన్స్‌జెండర్‌ల కోసం ప్రభుత్వం తీసుకున్న మంచి చర్లపై మాట్లాడుతుండగా బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రులు హరీష్‌రావు, ప్రశాంత్ రెడ్డిలు అవమానకరంగా మాట్లాడారని రామగుండం నియోజకవర్గం ట్రాన్స్ జెండర్‌లు తీవ్ర నిరసన తెలుపుతూ వారి వ్యాఖ్యలను ఖండించారు.ఆ నాయకులు క్షేమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిచో బిఆర్ఎస్ నేతల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ల అధ్యక్షులు కవితమ్మ, అధ్యక్షులు ఇజ్జిరి కామేశ్వరితో పాటు నిషా, పింకీ, రజిని, నర్సమ్మ, వెన్నెల, కావ్య, దుర్గా, నీలమ తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి లోబడి అధికారులంతా పని చేయాలి

మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: చట్టానికి లోబడి అధికారులంతా జవాబు దారి తనంతో పని చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు అన్నారు. శనివారం ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి కమాన్ పూర్ మండలంలో 50 లక్షల డి.ఎం.ఎఫ్.టి నిధులతో వ్యయంతో చేపట్టిన తహసిల్దార్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే కార్యాలయాల నిర్మాణ పనులను ప్రజా ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. కమాన్ పూర్, రామగిరి మండల కేంద్రాలలో తహసిల్దార్ కార్యాలయం భవనం, మంథని డివిజన్ కేంద్రంలో సమీకృత అధికారుల సముదాయం, నూతన ఆర్డీఓ కార్యాలయ నిర్మాణం చేపట్టామని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉద్దేశంతో మాత్రమే ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. మండల కేంద్రాలలో కూడా కార్యాలయాలు అంతా ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా అనువైన స్థలాలను ఎంపిక చేయాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. కుమార్ పూర్ మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కార్యాచరణ చేపడతామని, దీనికి ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కమాన్ పూర్ మండలంతో పాటు రామగిరి, ముత్తారం మండలాల్లో కూడా నూతన తహసిల్దార్ కార్యాల భవనాలను నిర్మిస్తున్నామని, మంథని లో డివిజన్ కు సంబంధించిన అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండే విధంగా సమీకృత కార్యాలయాల సముదాయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్‌లు కే చక్రవర్తి ఈఈపిఆర్ గిరీష్ బాబు, డి ఈ.నవీన్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మోడ్రన్ ఇక్రా స్కూల్‌లో ముందస్తుగా ఈద్ వేడుకలు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రంజాన్ పండుగ నేపథ్యంలో సృష్టికర్త వర్షించే శుభాలు, వరాలు, సుఖసంతో షాలు ప్రజలందరి జీవితాల్లో వెలసిల్లాలని మోడ్రన్ ఇక్రా స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ కోరారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతికలైన భారత దేశంలోని ప్రతి పండుగ మనందరి జీవితాల్లో ఆనందాలు నింపాలన్నారు. కొత్త గూడెం మున్సిపాలిటీలోని సుభాష్ చంద్రబోస్ నగర్ లో ఉన్న మోడ్రన్ ఇక్రా పాఠశాలలో ముందస్తుగా "ఈదుల్ ఫిత్ర్" పండుగ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాసిత్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఒకరి పండుగలను మరోకరు గౌరవించుకోనే ఉన్నత సాంప్రదాయం భారతదేశంలోనే ఉందన్నారు. అప్పుడే సమాజం లో శాంతి సామరస్యం, సమగ్రత వెల్లివిరుస్తుందన్నారు. ముఖ్యంగా రంజాన్ ఉపవాసాలు మనిషి లో దైవభీతి, సహనం, సాటి మనిషి పట్ల సానుభూతి, దయా, జాలి పెంపోదిస్తాయన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఒకరినోకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భారత దేశంలొ శాంతికి సామరస్యాలు విరాజిల్లాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రార్థన చేసారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎమ్. పర్వీన్ సుల్తానా, టీచర్లు ప్రసన్న, విజయలక్ష్మీ, సరస్వతీ, నీలా, శిరీషా, రాణి, సల్మా, నసరుత్, అనితా, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

ఏసి మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఇల్లందు : త్వరలో పూర్తి స్థాయిలొ అదనంగా ఇల్లందుకు ఏసి మార్కెట్ యార్డు తీసుకొచ్చి మరింత అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య వెల్లడించారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయంపై చైర్మన్ భానోత్ రాంబాబు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే కోరం పాల్గొని మాట్లాడారు. ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది 127.48 లక్షలు అధికంగా వసూలు చేయడంపై అభినందించారు. అదేవిధంగా టేకులపల్లి మిర్చి యార్డు ప్రారంభిచగా 311 మంది రైతులు సుమారు 1100 క్వింటాలు మిర్చి క్రయ విక్రయాలు చేసారన్నారు. దీంతో సుమారు రూ. కోటి టర్నోవర్ జరిగిందన్నారు. 40 ఏళ్ల చరిత్రలో మొట్ట మొదటిసారిగా నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి ఇల్లందు మార్కెట్ యార్డ్ ను చరిత్రలో నిలిచేలా కృషి చేసిన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు రాజులుగా ఉండాలన్నదే ప్రథమ లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇల్లందుకు ఏసి మార్కెట్ యార్డు కేటాయించాలని మంత్రి తుమ్మలకు వినతి పత్రం అందజేశామని ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ పాలకవర్గం, ప్రత్యేక శ్రేణి సుచిత్ర, గ్రేడ్3 కార్యదర్శి నరేష్ కుమార్ పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు రీ డిజైన్ అవినీతిపై విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - గార్ల : సీతారామా ప్రాజెక్టు రీడిజైన్‌లో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజక వర్గాలకు సాగు, తాగునీరు అందించాలని కోరారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2016లో రోల్లపాడులో శంకుస్థాపన చేసిన సీతారామ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో ప్రతిపాదిత ప్రాజెక్టు నమునా మొత్తాన్ని మార్చేసి ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గ ప్రాంతాలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్టు ప్రతిపాదిత నమూనాను మార్చేసి రీడిజన్ పేరుతో సీతారామ ప్రాజెక్టు ద్వారా వస్తున్న గోదావరి జలాలను నాగార్జునసాగర్ ఆయకట్టుగా పాలేరు, ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లి ప్రాంతాలకు తరలించుకపోవడం అన్యాయమన్నారు. సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టే బోయిన శ్రీనివాస్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందుకనూరి శ్రీనివాస్, టిఆర్ఎస్ గార్ల మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ మండల కార్యదర్శి గూగులోతు సక్రు, సిపిఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి, టిడిపి మండల నాయకులు కత్తి సత్యం, రంగరాజు శివాజీ, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు అలువాల రామకృష్ణ, రాంపురం మాజీ సర్పంచ్ భానోత్ రవి, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు దూడపంగు శ్రీనివాస్, కళాకారులు ఇమ్మడి వెంకన్న, ఎస్ నాగరాజు, ఎమ్మార్పిఎస్ నాయకులు దేశపాక మురళి పాల్గొన్నారు.

సంపాదకీయం

అసత్యాల మోదీ ప్రసంగాలు

అసత్యాలు చెప్పడం, తాను చెప్పే విషయాలే అంతిమ సత్యం అన్నట్టుగా మాట్లాడడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అలవాటైన విద్యే. ఇటీవల ఇ.టి. సమ్మిట్‌లో మాట్లాడిన మోదీ ప్రసంగంలో అవే అబద్ధాలు, అవే స్వోత్కర్షలు మరింత తీవ్ర స్థాయిలో వ్యక్తం అయినాయి. బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చిన తరవాత తమ ప్రభుత్వం మరింత వేగవంతంగా పని చేస్తోందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ వేగం ప్రజల జీవన గతిని మార్చడంలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. అయినా తమ ప్రభుత్వం వేగంగా పని చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారనీ, మద్దతు కూడా ఇస్తున్నారని మోదీ అన్నారు. దీనికి ఆయన కొన్ని ఉదాహరణలు కూడా ఇచ్చారు. గత జూన్‌లో ఒడిశా ప్రజలు బీజేపీకి మద్దతిచ్చారని, తరవాత హర్యానా ప్రజలు బీజేపీ మీద మరోసారి విశ్వాసం ప్రకటించారని, ఢిల్లీ ప్రజలు తమకు తిరుగులేని మెజారిటీ సంపాదించి పెట్టారని మోదీ గొప్పగా చెప్పుకున్నారు. కానీ షీలా దీక్షిత్ అధికారంలో ఉన్న 15 ఏళ్లపాటు, ఆ తరవాత 2011 నుంచి మొన్నటి దాకా కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం కొనసాగినన్నాళ్లు బీజేపీ ఢిల్లీ యవనిక మీంచి ఎందుకు మాయమైందో మాత్రం మోదీ చెప్పనుగాక చెప్పరు. ఏ అంశాన్నైనా తనకు అనుకూలంగా మలుచుకోవడంలో ఆయన దిట్ట. 2014 ఎన్నికలలో దేశవాసులు బీజేపీకి అధికారం ఇవ్వకపోతే ఏమయ్యేది అని ప్రశ్నించి దానికి సమాధానమూ ఆయనే చెప్పారు. అసలు అలా జరగకుండా ఉండేదే కాదన్నారు. దేశ ప్రజలు ఇప్పుడు వికసిత భారత్ లక్ష్యం సాధించడం కోసం బుజం బుజం కలిపి ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ ముందుకు సాగడంలో ఒక వర్గం ప్రజలు క్రమంగా అంతర్ధానం అవుతున్న వాస్తవాన్ని మాత్రం మోదీ ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించనే లేదు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరవాత దేశం మరింత వడివడిగా అడుగులు ముందుకు వేస్తోందని తాము చెప్పామని దానికి అనుగుణంగా వికసిత భారత్ దిశగా ఆర్థికాభివృద్ధి పరుగు పరుగున సాగుతోందని మోదీ అన్నారు. ఈ వేగం ఇవాళ కనిపిస్తోందని, దేశ ప్రజలు సమర్థిస్తున్నారని మోదీ చెప్పారు. మేం అధికారంలోకి రాక ముందు కూడా దేశం నడుస్తూనే ఉంది కానీ మేం వచ్చిన తరవాత దేశం నడకలో వేగం పెరిగిందని మోదీ అన్నారు. అయితే మోదీ ఎప్పుడూ సమర్థించలేని లెక్కల జోలికి పోరు. అసలు వాటి ప్రస్తావనే తీసుకు రారు. ఉదాహరణకు ప్రపంచ ఆకలి సూచికలో మొత్తం 170 దేశాల పరిస్థితిని బేరీజు వేసి చూస్తే భారత్ ఆ సూచికలో 117వ స్థానంలో ఉంది. సోమాలియా లాంటి దేశాలు కూడా ఈ సూచికలో మనకన్నా మెరుగైన స్థానంలోనే ఉన్నాయి. తాము వచ్చిన తరవాత అవినీతి తగ్గిందని మోదీ అంటున్నారు. మోదీ ప్రభుత్వ నడవడిక కారణంగా తగ్గినట్టు కనిపిస్తే కనిపించవచ్చు. ఎందుకంటే పెగాసస్ వ్యవహారం చర్చకు వచ్చి ఆ విషయం సుప్రీంకోర్టు దాకా వెళ్లిన సందర్భంలో ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయం అని వాదించి మొత్తం వ్యవహారాన్ని గంప కింద కమ్మేసింది. గత పదకొండేళ్ల కాలంలో ఎంత పెద్ద ఆరోపణ వచ్చినా ఒక్క సందర్భంలోనైనా మోదీ ప్రభుత్వం విచారణకు అంగీకరించలేదు. అవినీతి ఆరోపణలను ప్రస్తావనకే రానివ్వకుండా అడ్డుపడ్తూ ఉంటే ఇక బీజేపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు జనం దృష్టికి ఎలా వస్తాయి. ఇది సంపూర్ణంగా నిరంకుశ వైఖరే. 2014లో బ్యాంకుల మొండి బాకీలు రెండు లక్షల కోట్ల రూపాయలు ఉంటే ఇప్పుడు అవి 16.5 లక్షలకు చేరాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా చెప్పారు. బ్యాంకుల దగ్గర తీసుకున్న అప్పులను మోదీ ప్రభుత్వం అండ ఉన్న వ్యక్తులు ఎగవేస్తే అది అవినీతి కాకుండా ఎలా పోతుందో. బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా ఎగవేయడం ఈ ప్రభుత్వ దృష్టిలో అవినీతి కాదని నమ్మమంటున్నారు.

మోదీ అధికారంలోకి వచ్చిన తరవాతే 29 మంది బ్యాంకుల రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోయారు. వీరిలో ఒక్క విజయ మాల్యాను మినహాయిస్తే మిగతా 28 మంది గుజరాత్‌కు చెందిన వారే. దీనికి మోదీ దగ్గర నుంచి సమాధానమే ఉండదు. నిజానికి ఇది హోల్‌సేల్ అవినీతి. కాంగ్రెస్‌కు 60 ఏళ్లు అధికారం ఇచ్చారు, నాకు 60 నెలలు అధికారం ఇచ్చి చూడండి దేశాన్ని నందన వనంగా దిద్ది తీర్చుతానని నమ్మబలికి మోదీ గద్దెనెక్కారు. వరసగా మూడు సార్లు బీజేపీకి అధికారం ఇచ్చారు. అయినా జనజీవితం మెరుగుపడిన దాఖలాలే లేవు. మోదీ హయాంలో వడివడిగా ఆర్థికాభివృద్ధి సాధిస్తూ ఉన్నట్టయితే దేశంలో 80 కోట్ల మందికి నెల నెలా అయిదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలు అందించవలసిన అగత్యం ఏమిటో? ఇది ఏ అభివృద్ధికి సంకేతమో! కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి వేగాన్ని, దానితో పోటీ పడి అంతకన్నా ఎక్కువగా అవినీతి పరుగు పెట్టడాన్ని జనం గమనించారు అని మోదీ అన్నారు. ఇప్పుడు తమ హయాంలో కొనసాగుతున్న అవినీతిని గంప కింద కమ్మేస్తారు కనక జనం గమనించే అవకాశమే లేకుండా చేశారు. కాంగ్రెస్ హయాంలో ఆర్థికాభివృద్ధిలో మందకొడితనం ఇప్పటి దాకా కొనసాగి ఉంటే ఏం జరిగేది అని మోదీ ఎదురు ప్రశ్న వేశారు. దేశంలో అతి ముఖ్యమైన కాలం నాశనం అయ్యేది అని మోదీ అన్నారు. దేశంలోని అంతర్గత వ్యవహారాన్ని గమనిస్తే మోదీ అసత్యాలేమిటో బయటపడతాయి. ఉదాహరణకు చాలా కాలంగా ఉత్తర భారతంపై బీజేపీ పట్టు కొనసాగుతోంది. దక్షిణాదిలో కర్నాటకలో ఒక్క సారి మినహా బీజేపీకి ఏ రాష్ట్రంలోనూ అధికారమే దక్కనే లేదు. కానీ దక్షిణాది రాష్ట్రాలు సాధించిన అభివృద్ధికి ఉత్తరాది రాష్ట్రాలు ఇంకా చాలా వెనుకబడి పోయే ఉన్నాయి. దీనికి కారణం మోదీ విధానాలు, అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు కాదా? 2014 లో కాంగ్రెస్ 2044 కల్లా దేశం 11వ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న లక్ష్యంతో ముందుకు సాగేదని మోదీ హేళన చేశారు. ఇప్పుడు పదేళ్ల కాలంలోనే భారత్ అయిదవ స్థానానికి చేరుకుందని అనతి కాలంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి ఎదుగుతుందని మోదీ ఆనందంగా చెప్తున్నారు. ఆ మాట నిజమే కావొచ్చు. కానీ ఇది మోదీ మహాత్యం కాదు. ఉత్తమ ఆర్థిక వ్యవస్థల జాబితాలో ముందు వరసలో ఉన్న కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు మందగమనం సాగించడంతో ఈ సూచికలో భారత్ పైకి ఎదగడానికి అవకాశం వచ్చింది. వాటిని అధిగమించి మనం ప్రస్తుత స్థాయికి చేరుకోలేదు.

రైతు ఆదాయం రెట్టింపు ఎప్పటికి?


కేవీవీ ప్రసాద్

రైతాంగ ఉత్పత్తులకు చట్టబద్ధ ఎంఎస్‌పీ (మద్దతు ధర) లక్ష్యంగా అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) దశాబ్దాలుగా పోరాడుతున్నది. తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో ఏప్రిల్ 15, 16, 17 తేదీలలో జరిగే ఏఐకేఎస్ 30వ జాతీయ మహాసభల్లో చట్టబద్ధ యం.యస్.పి. లక్ష్యంగా ఆందోళనకు రూపుదిద్దబోతున్నది. డా॥ యం.యస్. స్వామినాథన్ కమిషన్ సూచించిన మేరకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం (సీ2 +50) కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలి. అయితే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచెయ్యలేదు. అనంతరం 2014లో అధికారం చేపట్టిన నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ ఎన్నికల హామీని సైతం అమలు చేయకుండా మోసం చేసింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేయటం సాధ్యం కాదని సుప్రీం కోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. దీంతో ఎన్నికల సమయంలో రైతాంగానికి నరేంద్ర మోదీ కల్పించిన ఆశలు వమ్ము అయ్యాయి. మరో వైపు వ్యవసాయ ఉత్పత్తుల పెట్టుబడి వ్యయం ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉన్నది. రైతులు పండించే పంటలకు మద్దతు ధరలు అందడంలేదు. రుణభారం పెరిగి రైతులు, కౌలురైతుల ఆత్మహత్యలు హనుమంతుని తోకలా పెరుగుతూనే ఉన్నాయి. పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం (సీ2+50) కలిపి మద్దతు ధరల డిమాండ్ రైతాంగం చేస్తూనే ఉన్నది.

పుండుపై కారం చల్లినట్లుగా 2020 జూన్ 5న రైతు వ్యతిరేక ఆర్డినెన్సును తెచ్చి ఎవరితో సంప్రదించకుండా అప్రజాస్వామికంగా లోక్‌సభ, రాజ్యసభలలో మూజువాణి ఓటుతో రైతు వ్యతిరేక చట్టాలను మోదీ ప్రభుత్వం తెచ్చింది. (1) మార్కెట్ వ్యవస్థకు సవరణ చట్టం (2) కాంట్రాక్ట్ వ్యవసాయం (3) నిత్యావసర ఉత్పత్తుల సవరణ చట్టం. ఈ చట్టాలు ఉరితాళ్లుగా భావించిన రైతాంగం ఢిల్లీ సరిహద్దుల్లో, దేశవ్యాపితంగా 13 మాసాలపాటు చరిత్రాత్మక ఉద్యమం నిర్వహించింది. 740 మంది రైతులు అమరులైనా స్పందించని మోదీ ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఓటమి భయంతో చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్లు స్వయంగా ప్రకటించారు. రైతు సంఘాలతో చర్చించకుండా విద్యుత్ సంస్కరణల బిల్లుకు తుది రూపం ఇచ్చేది లేదంటూ రైతుల డిమాండ్లపై చర్చించేందుకు ఆమోదయోగ్య కమిటీని ఏర్పాటు చేస్తామని నమ్మబలికి ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చింది. అయితే కమిటీని కార్పొరేట్ల గుత్తాధిపత్యానికి చట్టబద్ధత కల్పించేలా రూపొందించిన నల్లచట్టాల రూపకర్తలు, అనుకూలమైన అధికారులతో నింపివేసి రైతులకు ద్రోహం చేసింది.

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ రైతులను ఆశల పల్లకిలో ఓలలాడించింది. రైతుల ఆదాయం పెరగకపోగా మరింత నష్టాల్లోకి నెట్టింది. స్వామినాథన్ కమిషన్ సూచన ప్రకారం సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి (సీ2 +50) ఎమ్మెస్పీ నిర్ణయించనందున ఏటా దేశవ్యాప్తంగా రైతాంగం 3 లక్షల కోట్లు నష్టపోతున్నదని వ్యవసాయరంగ నిపుణుల అంచనా. దేశంలో 14.5 కోట్ల మంది రైతులుంటే మద్దతు ధర వల్ల కేవలం 87 లక్షల మందికే ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వ నివేదికలే వెల్లడిస్తున్నాయి. 2000-2017 మధ్యకాలంలో ఎమ్మెస్పీ లభించనందున రైతులు 45 లక్షల కోట్ల రూపాయలు నష్టపోయారు. వాస్తవాలు ఇలా ఉంటే రైతాంగ ఉత్పత్తులకు చట్టబద్ధ ఎమ్మెస్పీ కల్పించాలన్న కనీస ఆలోచన మోదీ ప్రభుత్వానికి లేకపోవడం విచారకరం.

నాటి రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా మరింత ప్రమాదకర చట్టాలు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నది. (1) నేషనల్ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ (2) నేషనల్ కో-ఆపరేటివ్ పాలసీ (3) డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకాలను ముందుకు తెచ్చింది. గత నల్లచట్టాలకు ప్రతిరూపమే ఈ పథకాలు. ఇవి చట్టరూపం దాల్చకుండా రైతాంగం మరోమారు ఉద్యమించాల్సిందేనని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. రైతాంగ ఉత్పత్తులకు చట్టబద్ధ ఎమ్మెస్పీ సాధించటం, వ్యవసాయరంగం నుంచి రైతాంగాన్ని దూరంచేసే దుర్మార్గపు చట్టాలు ఆమోదించకుండా చెయ్యటం రైతుల ప్రప్రథమ కర్తవ్యం.

ఈ పరిస్థితుల్లో అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) 30వ జాతీయ మహాసభలు ఏప్రిల్ 15, 16, 17 తేదీలో తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో జరుగుతున్నాయి. ఈ మహాసభల్లో జాతీయ రైతు కమిషన్ ఛైర్మన్ డా॥ ఎంఎస్ స్వామినాథన్, కమిషన్ సభ్యులు ఏఐకేఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి కీ॥శే॥ అతుల్ కుమార్ అంజాన్ స్ఫూర్తితో రైతాంగ ఉత్పత్తులకు చట్టబద్ధ ఎమ్మెస్పీ సాధన, రైతు వ్యతిరేక చట్టాల నిలుపుదల, రైతు రుణ మాఫీ, 55 సంవత్సరాలు నిండిన రైతు కూలీలకు పెన్షన్, కౌలురైతుల సమగ్ర చట్టం ప్రధాన అంశాలు కానున్నాయి. జాతీయ మహాసభల గౌరవార్థం రాష్ట్రంలో విజయవాడ, కర్నూలు, అనంతపురంలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన భారీ సదస్సులు నిర్వహించనున్నారు. జాతీయ మహాసభలు విజయవంతం కావాలని ఆశిద్దాం.

– ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

అమిత్‌షా హిందీ - సంఘ్ ఇంగ్లీషు

అరుణ్‌శ్రీవత్సవ



> **హిందీ జాతీయ భాషగా గుర్తించాలని కోరుతూ రాష్ట్రాలపై రుద్దడానికి తిరోగమన వాదులు, వర్గ శత్రువులు తెగిస్తున్నారు. భారత్‌లో భిన్న సంస్కృతులతో హిందీకి సంబంధం ఉన్నప్పటికీ, హిందూ- ఆర్యన్ భాషల వారసత్వం గలదే, గొప్ప సాహిత్యం, సాంస్కృతిక వారసత్వం ఉన్నది. అయితే ఈ మూర్ఖ విశ్వాసులు వీటిని తిరస్కరించడమే కాదు, ఇతరులను శత్రువులుగా పరిగణిస్తారు.**

తమిళనాడులో హిందీని అమలు జరిపి తీరాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వాదిస్తుండగా సంఘ్ పరివార్ (ఆర్ఎస్ఎస్) తాజాగా భిన్న వైఖరిని తీసుకోవాలని నిర్ణయించింది. అయితే సంఘ్ భిన్నమైన ఎత్తుగడను అమలు చేయనుంది. ఒక వ్యక్తి తన జీవనం కోసం అవసరమైన ఇంగ్లీషు నేర్చుకోవడం ఆర్ఎస్ఎస్ తాజాగా చెప్తోంది. ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సభ గత ఆదివారం ముగిసింది. ఈ సభలో సంఘ్ పరివార్ కొత్తగా భిన్నమైన నిర్ణయం తీసుకున్నది.

తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తీసుకున్న రాజకీయ నిర్ణయానికి సంఘ్ పరివార్ చేసిన నిర్ణయం సూటిగా లేనిది. భాషా సమానత హక్కు అని అదేమీ నేరం కాదని స్టాలిన్ స్పష్టం చేశారు. అమిత్‌షా వాదిస్తున్న దానికి సంఘ్ పరివార్ చేసిన తీర్మానం భిన్నంగా ఉంది. తమిళనాడులో తప్పనిసరిగా హిందీని రుద్దాలని కాషాయ దళం తెగించి ప్రయత్నాలు చేస్తోంది. డీఎంకే దేశ వ్యతిరేకి, దురహంకారి అంటూ బీజేపీ దూషిస్తోంది. మితవాద శక్తులు, వీర హిందూత్వ వాదులు ఉన్మత్తంతో, భాషా సమానత్వమే కాని, దురభిమానం కాదన్న విషయం మరచిపోయారు. ఈ నేపథ్యంలోనే స్టాలిన్ హిందూత్వ ఉన్మత్తులని తీవ్రంగా మాట్లాడారు. తమిళనాడు ప్రజలు రెండవ శ్రేణి పౌరులని అంటూ, హిందీయేతర భాష మాట్లాడే ప్రజలపై హిందీని రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని స్టాలిన్ అన్నారు. లోతుగా విశ్లేషించిన తర్వాతనే స్టాలిన్ స్పష్టంగా రాష్ట్ర ప్రజల అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కాషాయ దళాలు, హిందూత్వ (హిందువులు వేరు) ఉన్మత్తులు వాస్తవాలను చాలా తేలికగా వక్రీకరిస్తున్నారు. విషయం సూటిగా చెప్పకుండా మెలికలు తిప్పి చెప్తూ ప్రజలను గందరగోళ పరుస్తున్నారు. కాషాయ దళం సక్రమంగా ఉంటే హిందీ మాట్లాడే వాళ్లు ఉద్యోగాల కోసం, మంచి భవిష్యత్ కోసం దక్షిణాది రాష్ట్రాలకు పరుగెత్తేవాళ్లు. అయినప్పటికీ వీరు కన్నడ, మళయాళం తెలుగు సంస్కృతికి అలవాటుపడుతున్నారు.

ప్రాంతీయ స్వతంత్రత, జాతీయ స్థానిక ప్రభుత్వాల మధ్య సంబంధాలపై తరుచుగా చర్చ జరిగిన సందర్భంగా 'ఉప జాతీయత' అనే పదం వినియోగించే వారు. ఇది రాజకీయ భావజాలం, గుర్తింపును, ఆ ప్రాంతాల లేదా దేశంలో ఒక గ్రూపు ప్రయోజనాలు, రాజకీయంగా అధిక స్వతంత్రతలపై వక్కాణింపు, డిమాండ్లు ఉంటాయి. ఒక దేశం, ఒక భాష, ఒక పార్టీ కావాలని వాదించే రాజకీయ పార్టీ ఉప జాతీయ పరిధిలో అనుసరించే రాజకీయ సిద్ధాంతాన్ని ప్రశంసించలేం. ఇదొక అసహ్యకరమైన వాదన.

నరేంద్రమోదీ, అమిత్‌షా లాంటి నాయకుల స్ఫూర్తిని ఆర్ఎస్ఎస్ కొత్త పంథా తిరస్కరిస్తుంది. ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ భాషలను వ్యతిరేకిస్తుంది. విద్యారంగం, పరిపాలన, వాణిజ్య రంగంలో హిందీకి బదులుగా ఇంగ్లీషుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని కూడా ఆర్ఎస్ఎస్ ఫిర్యాదు చేస్తోంది. హిందీ జాతీయ భాషగా గుర్తించాలని కోరుతూ రాష్ట్రాలపై రుద్దడానికి తిరోగమన వాదులు, వర్గ శత్రువులు తెగిస్తున్నారు. భారత్‌లో భిన్న సంస్కృతులతో హిందీకి సంబంధం ఉన్నప్పటికీ, హిందూ- ఆర్యన్ భాషల వారసత్వం గలదే, గొప్ప సాహిత్యం, సాంస్కృతిక వారసత్వం ఉన్నది. అయితే ఈ మూర్ఖ విశ్వాసులు వీటిని తిరస్కరించడమే కాదు, ఇతరులను శత్రువులుగా పరిగణిస్తారు. ఆర్ఎస్ఎస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి ఆర్ ముకుంద బెంగళూరు సమావేశం ముగింపు దశలో మాట్లాడుతూ, మూడు భాషల అమలు సూత్రం ఆశ్చర్యకరమైందని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ ముఖ్య నాయకుడు "హిందీ- హిందూ- హిందూస్థాన్" కు ఎంతో ప్రాధాన్యత నిస్తారు. త్రిభాషా సూత్రానికి ముకుంద తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బహుళ భాషలు నేర్చుకున్నప్పటికీ జాతీయ భాష ఒక్కటే ఉండాలని అది హిందీయే కావాలని పరోక్షంగా ప్రకటించారు. ఒకటి మాతృభాష, మనం నివసించే సమాజంలోని ప్రాంతీయ లేదా మార్కెట్ భాష అవసరమన్నారు. ముకుంద వ్యాఖ్యానించిన రోజే అమిత్‌షా పార్లమెంట్‌లో ఇలా మాట్లాడారు. "మనకు వేలాది కిలోమీటర్ల దూరంలో ఉండేవారు మాట్లాడే భాష పేరుతో విషం చిమ్ముతున్నారు. వీరికి ఇండియా భాషలు అవసరం లేదు. ఈ దేశం ఏ విధంగా నడుస్తుంది? భాష పేరుతో దేశాన్ని విభజించడానికి ఎంతో చేశారు. ఇప్పుడైనా దీన్ని నిలిపివేయాలి. ఈ విషయాన్ని వెనుకనే ఉంచారు అని హిందీని రాష్ట్రాల మీద రుద్దాలని పరోక్షంగా మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల్లో ఉన్న భాషను దేశ వ్యాప్తం చేయాలని మోదీ, అమిత్‌షా లాంటి వారు పూనుకున్నారు.

గత నెలలో కేరళలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ మాట్లాడుతూ, హిందువులు ఇంగ్లీషు విడిచిపెట్టాలని పిలుపు నిచ్చారు. ఈ దేశంలో ఉద్యోగాలు చేసి జీవించడానికి సరైన అవకాశాలు లేక ఇతర దేశాలు వలస వెళుతున్నారు. వీరు తప్పనిసరిగా ఇంగ్లీషు నేర్చుకొని వెళ్లాలి. హిందీని రాష్ట్రాలపైన రుద్ది ఇంగ్లీషును, మాతృభాషను వదిలేయాలని ఈ మూర్ఖ విశ్వాసులు కోరుకుంటే ఇక్కడ యువత పరిస్థితి నిరుద్యోగులుగా కొట్టుమిట్టాడవలసిందే. ఇంగ్లీషును భారతదేశంలో లేకుండా నిషేధించాలని భగవత్ కోరుతున్నారు. లోహియా కూడా గతంలో ఇంగ్లీషు ఇండియాలో లేకుండా చేయాలని కోరారని భగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఉన్నత స్థాయి నాయకులు భగవత్, ముకుంద భిన్నాభిప్రాయాలని వెలిబుచ్చడం గమనార్హం. ఈ విషయంలో బీజేపీ- ఆర్ఎస్ఎస్ భిన్న వైఖరిని వెలిబుచ్చాయి. అయితే తాత్కాలిక ఎత్తుగడలే అని భావించవచ్చు. దక్షిణాది రాష్ట్రాల్లో హిందీని ప్రధాన భాషగా చేయాలని వీరు అనేక రకాల వ్యూహాలు పన్నుతున్నారు. మూడు కీలకమైన క్రిమినల్ చట్టాల పేర్లను సంస్కృతంలోకి మార్చడం ఎందుకని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రశ్నించారు. 1. భారత న్యాయ సంహిత, 2. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 3. భారతీయ సాక్ష్య చట్టంగా మార్పు చేశారు.

దేశంలోని 140 కోట్ల మందికి ఉద్దేశించిన చట్టాల పేర్లు ఎవరికీ అర్థం గాకుండా భాషను మార్చివేశారు. ఈ చట్టాల పేర్లను తమిళం ఇతర ప్రాంతీయ భాషల్లోకి ఎందుకు మార్చలేదని స్టాలిన్ ప్రశంసించారు. మూడు క్రిమినల్ చట్టాలను ఒకే భాషలోకి మార్చడం ఉన్మత్త గాక మరొకటి కాదు. తమిళ ప్రజలు ఈ చట్టాల పేర్లను కూడా ఉచ్చరించలేరని స్టాలిన్ అన్నారు. జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపి) వ్యతిరేకిస్తూ, అదొక విషం లాంటిదన్నారు. ఉన్మత్తులు, దేశ వ్యతిరేకులు అని అన్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 2

డా॥ అధికారి

ఆర్వీ రామారావ్

మీరట్ కుట్ర కేసులో ఎస్.వి.ఘాటే జైలుకెళ్లిన తరవాత డా. గంగాధర్ అధికారి కమ్యూనిస్టు పార్టీ రెండవ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అధికారి మౌలికంగా సిద్ధాంతవేత్త. సోషలిజం, కమ్యూనిజం మీద ఆశాభావం, భవిష్యద్దర్శనానికి తోడు అంకితభావంగల కార్యకర్తలు, మేధావులు అండగా నిలవక పోతే భారత కమ్యూనిస్టు పార్టీ కూడా పశ్చిమ దేశాల కమ్యూనిస్టు పార్టీలలాగే చరిత్ర గర్భంలో కలిసిపోయేదేమో. ఇలాంటి వారి పట్టుదల, నిబద్ధతే కమ్యూనిస్టు పార్టీకి జీవధార. డాంగే, పి.సి.జోషి, భవాని సేన్, ముజఫర్ అహమద్, ఎస్.కె.కృష్ణన్ లాంటి వారికి ఏ మాత్రం తీసిపోని మార్క్సిస్టు సిద్ధాంతవేత్త గంగాధర్ మోరేశ్వర్ అధికారి (1898 – 1983). ముంబైకి దగ్గరలోని కొలాబా జిల్లా పన్వెల్‌లో అధికారి కలిగిన కుటుంబంలోనే పుట్టారు. ఆస్తి కరిగిపోయిన తరవాత ఆయన తండ్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గుమాస్తాగా పని చేశారు. తరవాత బొంబాయికి మారి ఓ ఇరుకు ఇంట్లో ఉండేవారు. అధికారి పూర్తి పట్టణ వాతావరణంలోనే పెరిగారు.

లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ఉపన్యాసాలు వినడంతో 1918 లో అధికారికి రాజకీయాలంటే ఏమిటో తెలిసింది. డాంగే ఏర్పాటు చేసిన మరాఠీ సాహిత్య సంఘ సమావేశాలకు కూడా అధికారి వెళ్లే వారు. ఖుదీరాం బోస్, డా. ఆర్.జి.భండార్కర్, శాస్త్రవేత్త జగదీశ్ చంద్ర బోస్ మీద అభిమానం పెంచుకున్నారు. అధికారి 1920 లో పట్టభద్రులయ్యారు. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పరిశోధక విద్యార్థిగా చేరారు. విజ్ఞాన శాస్త్ర రంగంలో జర్మనీ సాధించిన విజయాలు గమనించి జర్మన్ భాష నేర్చుకున్నారు. అందరూ పై చదువులకోసం ఇంగ్లాండ్‌కు బారులు తీరుతున్న సమయంలో దేశభక్తితో పాటు, ఆర్థిక పరిస్థితి కారణంగా అధికారి జర్మనీ వెళ్లి ఫ్రెడరిక్ విలెల్మ్ యూనివర్సిటీలో చేరారు. భౌతిక రసాయన శాస్త్రం అభ్యసించారు. జర్మన్ భాష ముందే వచ్చినందువల్ల ఆరేళ్లలో పూర్తి చేయవలసిన పీహెచ్.డి. మూడేళ్లకే పూర్తి చేశారు. బెర్లిన్‌లో ఉండగా స్థిలార్డ్, యూజిన్ విగ్నేర్ లాంటి అనేక మంది శాస్త్రవేత్తలతో అధికారికి సంబంధాలు ఏర్పడ్డాయి. విగ్నేర్, స్థిలార్డ్ తరవాత అణుబాంబు తయారు చేసిన మణాట్టన్ పథకంలో పని చేశారు.

డబ్బు లేనందువల్ల అధికారి ఒంటి పూట భోజనంతో

సరిపెట్టుకున్నారు. ఆయన గురువు సాయంవల్ల ఉద్యోగం దొరికింది. కొంతకాలం ఓ ఫ్యాక్టరీలో రసాయన శాస్త్రవేత్తగా పని చేశారు. ఒక రోజు ప్రయోగశాలలో ఉండగా ఈ యువ భారతీయ శాస్త్రవేత్తను చూడడానికి ఐన్‌స్టీన్ స్వయంగా వచ్చారు. బెర్లిన్‌లో ఉండగానే అధికారికి సరోజినీ నాయుడు సోదరుడు, విప్లవకారుడు వీరేంద్రనాథ్ చటోపాధ్యాయతో పరిచయమైంది. జాకీర్ హుసేన్, ఆబిద్ హుసేన్, ఎం. ముజీబ్ లాంటి వారిని అధికారి కలుసుకున్నారు. మాక్స్ బీర్ ప్రసంగాలు విని, జాన్ రీడ్, రజనీ పామీదత్ పుస్తకాలు చదివి అధికారి కమ్యూనిస్టుగా మారారు. జర్మనీ కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకెళ్లి మార్క్సిస్టు గ్రంథాలు చదివే వారు. ఆయన బెర్లిన్ లో ఉండగానే మోతీలాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ, ఎస్. శ్రీనివాస అయ్యంగార్ మొదలైన వారు వచ్చి కలిశారు. సరోజిని నాయుడు కుమారుడు జయసూర్య, వీరేంద్రనాథ్ సోదరి సుహాసినీ చటోపాధ్యాయను కూడా అధికారి కలుసుకున్నారు.

1928 లో అధికారి జర్మనీ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. అధికారి అక్కడే, ఎం.ఎన్.రాయ్, పామీదత్ అన్న క్లెమెన్స్ దత్‌నూ కలుసుకున్నారు. అధికారి మరాఠీ పత్రిక "క్రాంతి" లో వ్యాసాలు రాసేవారు. ఏంగెల్స్ రాసిన "కమ్యూనిజం మీద ప్రశ్నలు, జవాబులు" గ్రంథాన్ని నేరుగా జర్మనీ నుంచి మరాఠీలోకి అనువదించారు. జర్మనీలో ఉండగా భారత్ పరిణామాలతో సంబంధాలు లేనందుకు ఆయనకు చింతగా ఉండేది. స్వదేశం రావడానికి మేఘ్ నాథ్ సాహా, సత్యేన్ బోస్, సర్ సి.వి.రామన్ లాంటి వారి సహాయం కోరారు. 1928 లో బొంబాయి వచ్చేశారు. వస్తూ వస్తూ ఆరవ కొమింటర్న్ మహాసభ సిద్ధాంతం కూడా మోసుకొచ్చారు. అధికారి దేశంలో కాలు మోపగానే సీఐడి అధికారులు ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా క్షుణ్ణంగా సోదా చేశారు. అధికారి దగ్గర దొరికిన మార్క్సిస్టు సాహిత్యాన్ని తరవాత మీరట్ కుట్ర కేసు విచారణ సమయంలో ఆయన మీద సాక్ష్యంగా చూపారు. ఆ తరవాత అధికారికి క్రమంగా సీపీఐ నాయకులతో సంబంధాలు ఏర్పడ్డాయి. 1929 మార్చి 20న మరో 31 మందితో పాటు అధికారిని కూడా అరెస్టు చేసి మీరట్ జైలులో ఉంచారు. అక్కడే ఆయన అనేక సిద్ధాంత పత్రాలు రాశారు. మోతీలాల్ నెహ్రూ లాంటి వారు జైలుకొచ్చి అధికారిని కలిసే వారు. 1933లో అధికారి జైలు నుంచి విడుదలై వచ్చే నాటికి కమ్యూనిస్టు పార్టీ పరిస్థితి

డా॥ గంగాధర్ అధికారి

అస్తవ్యస్తంగా ఉంది. ఆ సమయంలోనే అధికారి సీపీఐ ప్రధాన కార్యదర్శి అయ్యారు. పార్టీని ఐక్యం చేయడానికి కృషి చేశారు. 1934 లో ఆయనను మళ్లీ అరెస్టు చేసి బైకుల్లా జైలుకు పంపారు. 1937 లో నాటకీయంగా అధికారి జైలు నుంచి తప్పించుకున్నారు. కలకత్తా చేరుకుని "గాదరింగ్ స్టార్మ్" అని సీపీఐకి పక్కా ప్రణాళిక రూపొందించారు. 1946 ఫిబ్రవరిలో జరిగిన రాయల్ నేవీ తిరుగుబాటుతో కూడా అధికారికి సంబంధం ఉండేది. 1960లో పార్టీలో సైద్ధాంతిక చర్చలు జరుగుతున్నప్పుడు అధికారి విస్తృతంగా రాశారు. పార్టీ చీలిక తరవాత ఈ విషయంలో కీలక పాత్ర పోషించారు. అఖండ భారత్ నినాదంతో హిందువులు, ముస్లింలకు మధ్య విద్వేషం పెరుగుతోందని పదేళ్ల ముందే చెప్పిన క్రాంత దర్శి డా. అధికారి. ఆంధ్రప్రదేశ్‌లోని మంతెనవారిపాలెం రాజకీయ పాఠశాలలో ప్రసంగించడానికి వచ్చినప్పుడే ఆయనకు చంద్ర రాజేశ్వరరావుతో పరిచయమైంది.

స్టార్టప్ రంగంలో కేరళ వృద్ధి భేష్: విజయన్

తిరువనంతపురం: గ్రూప్ ఆఫ్ టెక్నాలజీ కంపెనీస్ (జీటెక్) నిర్వహించిన 'స్కిల్ సమ్మిట్ పెర్ల్యూట్ 2025'ను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం ప్రారంభించారు. తిరువనంతపురంలో జరుగుతున్న ఈ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 'ఈ కార్యక్రమం కేరళ సాంకేతిక అభివృద్ధిలో కీలకమైన పెట్టుబడి. ఇక్కడ జరిగే చర్చలు ఆ లక్ష్యానికి దోహదపడతాయని నేను నమ్ముతున్నాను. ఈ కార్యక్రమంలో భాగంగా 'మాదకద్రవ్యాల రహిత కేరళ' కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను. కేరళను ప్రతిభకు రాజధానిగా మార్చగల సామర్థ్యం మీకు ఉంది. ఈ సమ్మిట్‌లో చర్చలు ఆ దిశగా సాగాలి' అని ఆయన సూచించారు. '2016లో మేము స్టార్టప్ పాలసీ రూపొందించాం. దేశంలో ఏ రాష్ట్రమూ ఈ విధమైన పాలసీని రూపొందించలేదు. మొట్టమొదటిసారిగా కేరళనే ఈ రకమైన పాలసీని రూపొందించింది. గత 9 సంవత్సరాల్లో కేరళలో 6,200 స్టార్టప్‌ల్ని ప్రారంభించాం. దీంతో దేశంలో అత్యంత స్టార్టప్-స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థను కేరళ కలిగి ఉంది. ఈ రంగంలో కేరళ 254 శాతం వృద్ధి సాధించింది. ప్రపంచ సగటు కేవలం 46 శాతం మాత్రమే' అని విజయన్ పేర్కొన్నారు. స్టార్టప్ రంగంలో తాము జోక్యం చేసుకున్నట్లే... ప్రభుత్వం ఐటీ రంగంలోనూ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోంది. దీంతో ఐటీ పార్కుల్లో ఉద్యోగుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువైంది. రాష్ట్రంలో స్టార్టప్, ఐటీ రంగాలు గణనీయమైన వృద్ధి సాధించడానికి కేరళ యువత ప్రతిభకు నిదర్శనం. వ్యాపారానికి రాష్ట్రం అనుకూలంగా లేదని వస్తున్న ప్రతికూల అవగాహనలను కేరళ అధిగమిస్తోందని, పారిశ్రామిక రంగంలోనూ పురోగతి సాధిస్తుందని విజయన్ అన్నారు.

వక్ఫ్ బిల్లుకు మద్దతిస్తే జేడీయూకే నష్టం: పీకే

పూర్నియా: సమాజాన్ని విభజించే ఏ బిల్లుకూ తమ పార్టీ మద్దవివ్వదని జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) అన్నారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించారు. అదే సమయంలో బీజేపీ, జేడీ(యూ)ను విమర్శించారు. వక్ఫ్ బిల్లును ఎలాగైనా చట్టసభలో ఆమోదింపజేయించాలని బీజేపీ పట్టుదలతో ఉన్నదని, ఈ బిల్లుకు మద్దతిస్తే జేడీ(యూ)కు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. జేడీ(యూ) 12 మంది ఎంపీలు వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తే దానికి ఆమోదం లభించదని చెప్పారు. ఒకవేళ వారు వక్ఫ్ బిల్లును వ్యతిరేకించకపోతే నితీశ్ పార్టీకి తీరని నష్టం జరుగుతుందని ప్రశాంత్ కిశోర్ హెచ్చరించారు. బీహార్‌ను లాలు యాదవ్‌కు కాంగ్రెస్ హస్తగతం చేసినట్లుగానే... నితీశ్ కుమార్‌కు బీహార్‌ను బీజేపీ దారాదత్తం చేసిందని విమర్శించారు. నితీశ్ కుమార్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి ఎవరికీ ఎలాంటి సమాచారం లేదని వ్యాఖ్యానించారు. చిన్నపాటి ఉద్యోగానికి జరిగే నియామక ప్రక్రియకూ వైద్య పరీక్షలు అవసరం కాగా ఒక రాష్ట్రాన్ని నడిపించే వ్యక్తి ఆరోగ్యం గురించి ఎవరికీ పట్టడం లేదా అని ప్రశాంత్ కిశోర్ ప్రశ్నించారు. నితీశ్ కుమార్‌కు జిల్లాల పేర్లు కానీ మంత్రుల పేర్లు కానీ గుర్తుండటం లేదన్నారు. ఈ విషయాన్ని తెలిసినప్పటికీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విస్మయత నటిస్తున్నారని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు.

పార్లమెంట్‌లో చర్చలు అడ్డుకోవడమే బీజేపీ విధానం: ప్రియాంక

న్యూఢిల్లీ: పార్లమెంటులో సరైన చర్చలు జరగకుండా బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా విమర్శించారు. చర్చలను ఎలాగైనా నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ వ్యూహాలు పన్నుతోందన్నారు. పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడిన ప్రియాంక... ప్రజాస్వామ్య ప్రక్రియను కేంద్రం చిన్నచూపు చూస్తోందని దుయ్యబట్టారు. 'గత కొన్ని పార్లమెంటు సమావేశాలను గమనిస్తున్నా. ఏవిధంగానైనా చర్చలను అడ్డుకోవడమే వారి విధానంగా కనిపిస్తోంది. ఏదైనా అంశంపై విపక్షాలు నిరసనలు చేయబోయే సమయంలో వారిని రెచ్చగొట్టడం, విపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకోవడం కొనసాగుతోంది' అని ప్రియాంక పేర్కొన్నారు. ఎంపీల సాక్షిగా... పార్లమెంటు కార్యకలాపాలను ప్రజాస్వామ్య ప్రక్రియలో కొనసాగించకుండా కేంద్రం అడ్డుకోవడం విచారకరమన్నారు.

మైన్మార్‌కు భారత్ సాయం

- సహాయ సామగ్రి అందజేత
- 80 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలు

న్యూఢిల్లీ: భారీ భూకంపాలతో మైన్మార్, థాయ్‌లాండ్ వణిపోతున్నాయి. అక్కడి ప్రజల జీవనవిధానం అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటివరకు మైన్మార్‌లో 1000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ప్రకృతి విపత్తుతో అల్లాడిపోతున్న ఆ దేశానికి సాయం అందించడానికిభారత్ ముందుకొచ్చింది. 80 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అక్కడికి పంపింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు వెల్లడించారు. 'మైన్మార్‌కు సాయం అందించేందుకు భారత్ సిద్ధమైంది. ఈ విషయంపై చర్చించాం. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. మరికొన్ని గంటల్లో 80 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుంటారు' అని సీనియర్ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. ఇప్పటికే 'ఆపరేషన్ బ్రహ్మ' కింద మైన్మార్‌కు 15 టన్నుల సహాయక సామగ్రిని పంపించింది. టెంట్లు, దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు, ఆహార ప్యాకెట్లు అందించింది. అమెరికా, ఇండోనేషియా, చైనా కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి. ప్రభావిత దేశాలకు సహాయక సామగ్రి పంపుతున్నామని ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెరస్ వెల్లడించారు.

ప్రధాని మోదీ సంతాపం

మైన్మార్‌లోని పరిస్థితిపై స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. మృతులకు సంతాపం తెలిపారు. 'మైన్మార్ సీనియర్ జనరల్ మిన్ అంగ్ హ్లైంగ్‌తో ఈ విషయంపై మాట్లాడాను. అక్కడి పరిస్థితిని భారత్ ప్రభుత్వం తెలుసుకుంది. ఈ ఘటనపై విచారం వ్యక్తంచేస్తున్నాం. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. ఈ క్లిష్ట సమయంలో మైన్మార్‌కు భారత్ అండగా ఉంటుంది. మానవతా సాయం, సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తరలించాం. బాధిత దేశానికి మేము అండగా ఉంటాం' అని హామీ ఇచ్చారు.

పాక్ కుట్రలు పిల్లల ప్రాణాలు తీస్తున్నాయి

జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం చౌదరి

కశ్మీరు: సరిహద్దు అవతల పన్నుతున్న కుట్రల వల్ల తమ పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌదరి ఆవేదన వెలిబుచ్చారు. హింసతో ఏమీ సాధించలేమనే విషయాన్ని తెలుసుకొని పాకిస్థాన్ ఇప్పటికైనా ఉగ్రవాదాన్ని వదులుకోవాలని హితవు పలికారు. మూడు దశాబ్దాలుగా అక్కడ ఉన్న ఉగ్రవాదం అంతమై... మంచి పరిస్థితులు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కానీ, జమ్మూకశ్మీర్ ప్రభుత్వం కానీ మన పిల్లల బలిదానాలను ఎప్పటికీ కోరుకోవని, సరిహద్దు అవతల పన్నుతున్న కుట్రల కారణంగానే వారు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గత 30 ఏళ్లుగా మనపై దాడులు చేస్తున్నా వారు ఏమీ సాధించలేదని, ఉగ్రచర్యలకు భారత్ లొంగదని పాకిస్థాన్ గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల తనకు తానుగా ప్రమాదాన్ని తెచ్చిపెట్టుకుంటోందని సురీందర్ చౌదరి అన్నారు. కథువా జిల్లాలోని సఫియాన్ అడవిలో ఉగ్రవాదులతో రెండు రోజుల పాటు జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రసంస్థ జైష్-ఎ-మొహమ్మద్‌తో సంబంధం ఉన్న ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా... ఒక డీఎస్పీతో పాటు నలుగురు సైనికులు గాయపడ్డారు. మృతిచెందిన పోలీసులకు నివాళులర్పించిన అనంతరం సురీందర్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కథువా జిల్లాలోని అడవుల్లో టెర్రరిస్టులు ఉన్నారన్న సమాచారంతో నేషనల్ సెక్యూరిటీ గార్డ్, బీఎస్ఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ బృందాలు ఐదు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఇంకా ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు స్థానికంగా నక్కిఉన్నట్లు తెలుస్తోంది. ఆర్మీ దుస్తుల్లో ఉన్న ఉగ్రవాదులు తమను మంచి నీళ్లు అడిగారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు వారికోసం వేట కొనసాగిస్తున్నాయి.

సొంత టెలికాం టెక్నాలజీ ఉన్న దేశాల సరసన భారత్: సింధియా

న్యూఢిల్లీ: సొంత టెలికాం టెక్నాలజీ కలిగిన చైనా, ఫిన్లాండ్, స్వీడన్, దక్షిణా కొరియా దేశాల సరసన భారత్ చేరిందని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలికాం కంపెనీలు విలీనవుతున్నాయన్నారు. భారత్‌లో నాలుగు కంపెనీలు ఉన్నాయన్నారు. 2014లో 90కోట్ల మంది మొబైల్ కస్టమర్స్ ఉండగా... నేడు ఈ సంఖ్య 1.2 మిలియన్లకుపైగా పెరిగిందన్నారు. అప్పుడు 25కోట్ల మంది ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యారని... ప్రస్తుతం 97 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నట్లు వివరించారు. 2014లో ఆరు కోట్ల మందికి బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ ఉందని... ఆ సంఖ్య నేడు 94 కోట్లకు చేరుకుందని.. ఇది అమెరికా మొత్తం జనాభా కంటే ఎక్కువ అని తెలిపారు. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా లక్ష స్వదేశీ 4జీ మొబైల్ టవర్లను ఏర్పాటు చేస్తోందని... వీటిని 5జీగా మారుస్తామని, ఈ పని జూన్ నాటికి పూర్తవుతుందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ యోజన కింద జరుగుతోందన్నారు. ప్రభుత్వం డైరెక్ట్-టు-డివైస్ ఉపగ్రహ సేవలను ప్రారంభించిందని సింధియా చెప్పారు. ఈ సాంకేతికతలో నెట్‌వర్క్‌కు కనెక్ట్ కానప్పడు కూడా స్మార్ట్‌ఫోన్ నుంచి సందేశాలను పంపొచ్చన్నారు. కనెక్టివిటీ మొబైల్ టవర్ నుంచి కాకుండా ఉపగ్రహం నుంచి నేరుగా అందుతుందన్నారు. ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ భారతదేశంలో ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవలను ప్రారంభించడానికి దరఖాస్తు చేసుకోవడమే కాకుండా... ఇతర అనేక కంపెనీలు సైతం ఆసక్తిని చూపాయన్నారు. ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవల కోసం ఇప్పటికే రెండు కంపెనీలకు లైసెన్స్‌లు ఇచ్చామని సింధియా చెప్పారు. ఇందులో ఒకటి రిలయన్స్, మరొకటి భారతీ ఎయిర్‌టెల్‌కు జారీ చేసినట్లు వివరించారు.

బిలియనీర్ మిత్రులకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ

మోదీ సర్కార్‌పై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ: బీజేపీ ప్రభుత్వం ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడిందని లోక్‌సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. తన బిలియనీర్ స్నేహితులకు మోదీ ప్రభుత్వం 16 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విషయంపై రాహుల్ శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'బీజేపీ ప్రభుత్వం తన బిలియనీర్ స్నేహితులకు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసింది. ఆశ్రితవాదం, నియంత్రణా దుర్వినియోగం కలిసి... భారతదేశ బ్యాంకింగ్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది. జూనియర్ బ్యాంకింగ్ ఉద్యోగులపై దీని ప్రభావం పడుతుంది. వారిపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో వారు తీవ్ర పరిణామాలకు లోనవుతున్నారు' అని రాహుల్ మండిపడ్డారు. ఈ సందర్భంగా తనను కలిసిన ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగుల ప్రతినిధి బృందం సభ్యులు చెప్పిన ఆవేదనను ఆయన ప్రస్తావించారు. ఇటీవల పార్లమెంటులో 782 మంది ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగులు తనని పార్లమెంటులో కలిసి... అనైతిక రుణాల్ని మంజూరు చేసినందుకు, వాటికి అవలంబించిన పద్ధతులను బహిర్గతం చేసినందుకు ప్రతీకారంగా బ్యాంకు ఉద్యోగులపై బలవంతపు బదిలీలు, వేధింపులకు గురిచేస్తున్నట్లు వారి అనుభవాలను తనకి చెప్పినట్లు రాహుల్ పేర్కొన్నారు. బ్యాంకు ఉద్యోగుల అనుభవాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని రాహుల్ అన్నారు. ఇలాంటి ఒత్తిడికి తట్టుకోలేక ఇద్దరు ఉద్యోగులు ఆత్మహత్యకు పాల్పడేందుకు దారితీసిందని రాహుల్ చెప్పారు. ఈ సమస్య కేవలం ఐసీఐసీఐ బ్యాంక్‌కు మాత్రమే కాకుండా అనేకమంది బ్యాంకింగ్ నిపుణులను ప్రభావితం చేసింది. ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడుతున్న మోదీ ప్రభుత్వం ఉద్యోగుల ప్రాణాల్ని బలితీసుకుంటుంది. ఇది దేశవ్యాప్తంగా వేలాది మంది నిజాయతీపరులైన నిపుణులను ప్రభావితం చేసే అత్యంత ఆందోళనకరమైన విషయం. బ్యాంకు ఉద్యోగుల అంశాన్ని పరిగణనలోకి తీసుకుని వారు పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న వేధింపులు, దోపిడికి వ్యతిరేకంగా పోరాడటానికి ప్రతిజ్ఞబూనుతున్నట్లు రాహుల్ తెలిపారు. శ్రామిక తరగతి నిపుణులకు న్యాయం కోసం పోరాడటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రాహుల్ పేర్కొన్నారు.

కేంద్రానికి 'ఉపాధి' కూలీల దుస్థితి పట్టదా: స్టాలిన్

చెన్నై : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను నిర్వీర్యం చేసిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ విమర్శించారు. శనివారం తమిళనాడు అంతటా వందలాది మంది డీఎంకే కార్యకర్తలు భారీ నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, కూలీలకు రావాల్సిన జీతాలను విడుదల చేయనందుకు బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, జీవనాధారంగా యూపీఏ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎంజీఎన్ఆర్ఈజీఏ ను ధ్వంసం చేసేందుకు క్రూరమైన బీజేపీ బయలుదేరింది. ఒక్క సంతకంతో కార్పొరేట్‌లకు లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే, మండే ఎండల్లో తమ చెమటతో శ్రమించిన పేదలకు జీతాలుగా ఎందుకు విడుదల చేయడం లేదు? డబ్బు లేదా హృదయం లేదా?' అని సామాజిక మాధ్యమ వేదికగా స్టాలిన్ నిలదీశారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు పెట్టడం బీజేపీకి ఇష్టం లేదని మండిపడ్డారు. తమిళనాడు అంతటా నేటి నిరసనల ద్వారా డీఎంకే సభ్యులు, పేద ప్రజల గొంతుకలు న్యూఢిల్లీకి చేరుకోవాలని అన్నారు. 'బీజేపీ ప్రభుత్వానికి అవమానం!' స్టాలిన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. దాదాపు 1,170 చోట్ల జరిగిన నిరసనలో వేలాది మంది మహిళలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ... బీజేపీ ప్రభుత్వం వెంటనే ఉపాధి కూలీలకు రూ.4,034 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకారులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మా జీతం ఎక్కడ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మరో ప్లకార్డులో మహిళలకు సీఎం ప్రతినెలా రూ.1000 ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు..

సీఎం అవుతానని ముందుగా తెలియదు: రేఖాగుప్తా

న్యూఢిల్లీ: తాను ముఖ్యమంత్రి అవుతానని ముందుగా తెలియదని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చెప్పారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయం వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎంపిక విషయం ఎవరి ఫోన్ చేసి చెప్పారు? ఆ విషయం మీకు ఎలా తెలిసిందని రేఖా గుప్తాను మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి అవుతున్నట్టు తనకు తెలియదన్నారు. అందరి ఎమ్మెల్యేల్లాగానే తాను కూడా బీజేపీ శాసనసభాపక్ష సమావేశానికి వెళ్లానని, అధిష్ఠానం దూతలు సీఎం పేరు ప్రకటించేంత వరకు ఆ విషయం తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. అంతకముందు అధిష్ఠానం నుంచి తనకు ఫోన్ కాల్ రాలేదని, కేవలం ఎమ్మెల్యేల సమావేశంలో మాత్రమే ముఖ్యమంత్రిగా ఎంపికైనట్లు తెలిసిందన్నారు. ఎమ్మెల్యే కావాలనే కల ఉండేదని, కానీ ముఖ్యమంత్రి అవుతానని ఎప్పుడూ అనుకోలేదన్నారు. సుదీర్ఘకాలం రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ అత్యున్నత పదవికి ఎంపిక కావడం ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు. ఎన్నికల ఫలితాల తర్వాత అనేక పేర్లు తెరపైకి వచ్చాయని, అందులో తన పేరు కూడా వినిపించిందని, కానీ తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని చెప్పారు. ఈ విషయంలో తన పాత్ర ఏమీలేదన్నారు. ఎమ్మెల్యేల సమావేశంలో ఒక సంఘటన జరిగిందని, ఒక నాయకుడు తన దగ్గరకు వచ్చి ఏదైనా కాల్ వచ్చిందా అని అడిగారని, అలాంటిదేమీ రాలేదని సమాధానం ఇచ్చానన్నారు. ఆయన తనను అబద్ధాలకోరు అని పిలిచారన్నారు. మరొక సీనియర్ నాయకుడు వచ్చి... ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నట్లు చెప్పాడన్నారు

కునాల్ కమ్రాపై మరో మూడు కేసులు



ముంబై : స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా మరింత చిక్కుల్లో పడ్డాడు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కునాల్ కమ్రాపై ఖార్ పోలీసు స్టేషన్‌లో మూడు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. వాటిలో ఒకటి జలగావ్ నగర మేయర్ దాఖలు చేయగా, మిగిలిన రెండు ఫిర్యాదులు నాసిక్‌కు చెందిన హోటల్ వ్యాపారి, వ్యాపారవేత్త నుంచి వచ్చినట్లు ముంబై పోలీసులు తెలిపారు. ఖార్ పోలీసులు రెండుసార్లు కమ్రాను విచారణకు పిలిచారు. కానీ అతను ఇంకా విచారణకు హాజరు కాలేదు. అంతకుముందు, కునాల్ కమ్రాపై నమోదయిన అనేక ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి మద్రాస్ హైకోర్టు శుక్రవారం మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి జస్టిస్ సుందర్ మోహన్ షరతులతో ఏప్రిల్ 7వ తేదీ వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. కునాల్ కమ్రా తన ఇటీవలి వ్యంగ్య వ్యాఖ్యలతో తనకు చాలా బెదిరింపులు వస్తున్నాయని పేర్కొంటూ ట్రాన్సిట్ ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తదుపరి విచారణ కోసం మార్చి 31న ఖార్ పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని ముంబై పోలీసులు మార్చి 27న హాస్యనటుడిని కోరారు. శివసేన ఎమ్మెల్యే ముర్జీ పటేల్ ఖార్ పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేసిన కేసులో కమ్రాకు ఇవి మూడో సమన్లు. రెండు సమన్లలో అతను పోలీసుల ముందు హాజరుకాలేదు. అంతకుముందు గురువారం, కునాల్ కమ్రా ప్రధాన స్రవంతి మీడియాను విమర్శించారు. అది అధికార పార్టీ గొంతుకగా పని చేస్తోందని ఆరోపించారు.

కునాల్‌కు ప్రత్యేక రక్షణ: రౌత్



ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై వివాదాస్పద వ్యాఖ్యల వివాదంలో చిక్కుకున్న స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని శివసేన నేత సంజయ్ రౌత్ డిమాండ్ చేశారు. కామ్రపై ఖార్ పోలీస్ స్టేషన్‌లో మరో మూడు కేసులు శనివారం నమోదుకావడంపై మీడియాతో సంజయ్ రౌత్ మాట్లాడుతూ శివసేనతో వివాదం సమయంలో బీజేపీ ఎంపీ కంగనా రణావత్‌కు ప్రత్యేక రక్షణ కల్పించినట్టే ఇప్పుడు కామ్రకు కూడా ప్రత్యేక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 'కంగనా రణావత్ అప్పట్లో మాతో (శివసేన) గొడవపడ్డారు. ఆ సమయంలో మేము ఆమెకు ప్రత్యేక రక్షణ కల్పించాం. ఇప్పుడు కునాల్ కామ్రకు సైతం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలి' అని రౌత్ అన్నారు.

దేశ వ్యతిరేక సంస్థల నుంచి కునాల్‌కు నిధులు: శివసేన

ముంబై: విదేశాల్లోని భారత వ్యతిరేక సంస్థల నుంచి స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా నిధులు పొందుతున్నారని శివసేన నేత రాహుల్ ఆరోపించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర అధికార నాయకుల గురించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నందుకు విదేశాలలోని భారత వ్యతిరేక ఉగ్ర సంస్థలు, ఖలిస్థానీ గ్రూపులు కునాల్‌కు డబ్బులు ఇస్తున్నాయని అన్నారు. వీటి ద్వారా ఆయనకు వచ్చిన నగదుకు సంబంధించిన 300 స్క్రీన్‌షాట్‌లు ఉన్నాయని...వాటిని పోలీసులకు అందజేస్తానని రాహుల్ పేర్కొన్నారు. నిజం తెలియాలంటే అధికారులు కునాల్ యూట్యూబ్ ఖాతాను పరిశీలించాలని డిమాండ్ చేశారు. మన దేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం కొన్ని దేశాలకు నచ్చలేదని... అందుకే కునాల్ వంటి కొందరికి డబ్బు ఆశచూపి ప్రజల్లో మన నాయకులను తప్పుగా చూపించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు. అతడికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను నిలిపివేయాలని...వాటిని నిఘా వేయాలని డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపై ఇటీవల కునాల్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆయనపై కేసులు నమోదుకాగా, తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా ఏప్రిల్ ఏడువరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తాం: షిండే

పూణే : ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శనివారం అన్నారు. తన మంత్రివర్గ సహచరుడు అజిత్ పవార్ 'రైతులు పంట రుణాల మాఫీ కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు' అనే ప్రకటన సంచలనం రేపిన మరుసటి రోజు ఈ ప్రకటన చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఉద్యోగుల జీతాల కోసం నిధులు అందుబాటులో ఉండాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సమతుల్యతను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పటిష్టమైన తర్వాత లడ్కీ బహిన్ యోజన కింద మహిళలకు నెలవారీ సాయాన్ని రూ.1,500 నుంచి రూ.2,100కి పెంచుతామని షిండే చెప్పారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిమితులను ఉటంకిస్తూ, రుణమాఫీ ప్రకటన కోసం ఎదురుచూడకుండా తమ పంట రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి అజిత్ పవార్ రైతులకు సూచించిన ఒక రోజు తర్వాత షిండే ఈ హామీ ఇచ్చారు. అజిత్ పవార్ వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా, 'మేము మ్యానిఫెస్టోలో పేర్కొన్న వాగ్దానాలు ఏవైనా వాటిని నెరవేరుస్తాం. ప్రతి హామీని గౌరవిస్తాం. మేము దానిని ముద్రణలో తప్పు అని పిలుస్తాం' అని అన్నారు. షిండే ఛత్రపతి శంభాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా పూణే జిల్లాలోని వధు వద్ద ఆయన సమాధిని సందర్శించారు. 'మా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి 16,000 కోట్ల రూపాయల సాయం అందించాం' అని చెప్పారు.

మోదీ ఇలాకాలో అరకొర సేవలు

- వైద్యరంగం అస్తవ్యస్తం
- డాక్టర్లు, నర్సులు, పడకలు కరువు
- అసెంబ్లీలో మండిపడ్డ కాగ్
- 8 శాతం నిధుల పెంపునకు సిఫారసు

అహ్మదాబాద్: ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో అన్ని సేవలూ అరకొరగానే ఉన్నాయి. దశాబ్దాలుగా బీజేపీ పాలిస్తున్నప్పటికీ వైద్య రంగం అస్తవ్యస్తంగా ఉంది. 'ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు సరిపడా లేరు. కనీసం రోగులకు అవసరమైన పడకలు కూడాలేవు. సమగ్రమైన ఆరోగ్య విధానం లేక ఆరోగ్య రంగమంతా లోపాలతో నిండి ఉంది' అని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తీవ్రంగా వ్యాఖ్యానించింది. ముఖ్యంగా అత్యవసర విభాగాలైన ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్ బ్యాంకులలో కూడా సేవలు సరిగ్గా లేవంటూ పలు లోపాలను ఎత్తిచూపింది. ఆరోగ్య సేవల ప్రజారోగ్య మౌలిక సదుపాయాలపై కాగ్ తన నివేదికను అసెంబ్లీ ముందు ఉంచింది. రాష్ట్రంలో 22 జిల్లాల్లో 25 శాతం డాక్టర్లు, 19 జిల్లాల్లో 25 శాతం కన్నా ఎక్కువ పారా మెడికల్ సిబ్బంది కొరత ఉన్నట్టు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం బడ్జెట్‌లో ఈ రంగానికి 5.4 శాతం నిధులు ఇచ్చారని, అయితే జాతీయ ఆరోగ్య విధానం సిఫార్సు మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి ఎనిమిది శాతం నిధులు కేటాయించాలని కాగ్ సూచించింది. మానవ వనరుల నిర్వహణకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఎలాంటి విధానాన్ని రూపొందించ లేదని కాగ్ తప్పు బట్టింది. 2016-22 మధ్య 9,983 మంది ఆరోగ్య సిబ్బందిని నియమించినప్పటికీ డాక్టర్లు 23 శాతం, నర్సులు ఆరు శాతం, పారా సిబ్బంది కొరత 25 శాతం ఉందని తెలిపింది. ప్రత్యేక డాక్టర్ పోస్టులు సబ్ డివిజన్ల ఆసుపత్రుల్లో 51 శాతం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో 49 శాతం ఖాళీగా ఉన్నాయని పేర్కొంది. ఇక జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద 31 శాతం ప్రత్యేక డాక్టర్లు, 32 శాతం పారా మెడికల్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కళాశాలలు, పాఠశాలల్లో 76 శాతం బోధనా సిబ్బంది కొరత ఉందని కాగ్ తెలిపింది.

విశాలాంధ్ర హైదరాబాద్

పిడుగుపాటు మృతులకు నష్టపరిహారం నిధులు విడుదల : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో గత ఐదేళ్లలో పిడుగుపాటు, అగ్నిప్రమాదాల కారణంగా మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని విడుదల చేసింది. ఈమేరకు ఆయా జిల్లా కలెక్టర్లకు సమాచారం పంపించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందేలా విపత్తు నిర్వహణ విభాగం ఆదేశాలు జారీ చేసింది. పిడుగుపాటుతో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి ఆరు లక్షల రూపాయిల చొప్పున, అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాలకు ఈ పరిహారం త్వరితగతిన అందించాలని మంత్రి ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరుగురికి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆరుగురికి, కొమరం భీమ్ జిల్లాలో నలుగురికి, హనుమకొండ జిల్లాలో ముగ్గురికి, నారాయణపేట్, జోగులాంబ, మెహబూబాబాద్, మెదక్ జిల్లాలో ఇద్దరికి రాజన్న సిరిసిల్ల జిల్లా, జనగాం, యాదాద్రి, పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, జగిత్యాల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, కామారెడ్డి, నిర్మల్, సూర్యాపేట జిల్లాలలో ఒక్కొక్కరికి ఈ నష్టపరిహారం మంజూరైంది. అదేవిధంగా హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో అశువులు బాసిన పది మంది కుటుంబాలకు మనిషికి రూ.4 లక్షల చొప్పున 40 లక్షల రూపాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదేగాక హైదరాబాద్‌లోని రుబీ హెూటల్ అగ్నిప్రమాద ఘటనలో మృతి చెందిన 8 మంది కుటుంబాలకు రూ.32 లక్షల రూపాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది.

హైదరాబాద్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు : మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని, నగర ప్రజలకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, "ఉగాది అంటే కొత్త ఏడాదికి ఆశాజనక మైన ఆరంభమని, ఇది మన సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే పర్వదినమన్నారు. ఉగాది పచ్చడి మనిషి జీవితం అనేక రుచుల సమ్మేళనం అనే సందేశాన్ని అందిస్తుందని అన్నారు. ఈ ఉగాది అందరి జీవితంలోనూ ఆనందం, అభివృద్ధి, ఆరోగ్యం, శాంతి, సంపదలు చేకూర్చాలని ఆమె ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరం అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లేందుకు జిహెచ్ఎంసీ నిరంతరం కృషి చేస్తోందని, నూతన సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రజల సహకారంతో నగరాన్ని మరింత మెరుగు పరిచేందుకు కృషి కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలంతా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, శుభ్రమైన, ఆరోగ్యకరమైన హైదరాబాద్ నిర్మాణానికి సహకరించాలని కోరుతూ, మరోసారి అందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

మల్కాజిగిరి రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన జీఎం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసి, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పునరాభివృద్ధి పనులను సమీక్షించారు. హైదరాబాద్ డిఆర్ఎం లోకేష్ విష్ణోయ్ మరియు ఇతర అధికారులు సీనియర్ డిసిఎం అనిరుధ్ పర్మార్, సీనియర్ డిఎస్‌టిఇ నీలా పావని, సీనియర్ డిఇఇ కిరణ్ కుమార్, సీనియర్ డిఓఎం విద్యాధర్ ఈ తనిఖీలో జిఎంతో పాటు పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే - జెడ్ఆర్‌యుసిసి సభ్యుడు నూర్, హైదరాబాద్ డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యుడు పి.భరద్వాజ్ సబర్బన్ ట్రైన్ అండ్ బస్ ట్రావెలర్స్ అసోసియేషన్ (మల్కాజిగిరి) తరపున జిఎం అరుణ్ కుమార్ జైన్‌ను శాలువా, మెమెంటోతో సత్కరించారు.

30, 31సెలవు దినాల్లోనూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు అవకాశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ నెల 30, 31 సెలవు దినాల్లో నూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించవచ్చునని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరక శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది.ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపునకు ప్రభుత్వం మార్చి 31 వరకూ అవకాశం ఇచ్చింది. ఈ లోపు చెల్లించిన వారికి రాయితీని ఇస్తుంది. ఈనెల 30వ తేదీన ఉగాది, 31 వ తేదీన రంజాన్ పండుగల దృష్ట్యా ప్రభుత్వం ఇది వరకే సెలవులు ప్రకటించింది. ఫీజు చెల్లింపు తుది గడువూ ఇంకా రెండు రోజులు మాత్రమే ఉన్నందున ప్రజల సౌలభ్యం కోసం ఈ రెండు సెలవుదినాల్లోనూ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ అవకాశంను సద్వినియోగం చేసుకొని రాయితీతో లే ఔట్ ఫీజులు చెల్లించి తమ ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలనీ ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

రాజీవ్ యువ వికాస పథకం గడువు పొడిగించాలి



విశాలాంధ్ర - ఎల్‌బి.నగర్ : రాజీవ్ యువ వికాస పథకం గడువు పొడిగించాలని బిసి హక్కుల సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డు పిల్లి కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ప్రకటించినటువంటి రాజీవ్ యువ వికాస పథకం, రాష్ట్రానికి చెందిన నిరుద్యోగ యువతి, యువకులకు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలకు చెందిన వారికి, లక్ష నుంచి మూడు లక్షలు, నాలుగు లక్షలు, వరకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించడం సంతోషదాయకమే అయినా ఇట్టి యువ వికాస ఉపాధి పథకానికి అర్హులను ఎంపికలో కొన్ని నిబంధనలు పెట్టారని, వాటికి అనుగుణంగా సంబంధిత ధ్రువపత్రాలు జతపరచాలంటే ప్రభుత్వం ప్రకటించిన కాలం సరిపోదని, కాబట్టి కాలం గడువు పెంచాలని కోరారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలు లక్షల మంది ఉన్నారని, రేషన్ కార్డు లేకుండా, ఆయా ధృవ పత్రాలు పొందాలంటే, రెవెన్యూ నిబంధనలు అంగీకరించడం లేదన్నారు. రేషన్ కార్డులు ఇవ్వకుండా, ఆదాయ ధృవపత్రాలు అందకుండా, రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవడం అనేది సాధ్యం కాదన్నారు. అలాగే ఈ రాజీవ్ యువ వికాసానికి విధించినటు వంటి కాల పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉండటం వల్ల దరఖాస్తుదారుల, దరఖాస్తులన్నీ కుప్పలు, తెప్పలుగా ఉంటున్నాయని, వాటిని పరిశీలించే నాథుడు లేడని, వాటన్నిటిని ఒక డబ్బాల్లో డ్రమ్ముల్లో వేసి వెళ్ళండని సంబంధిత రెవెన్యూ కార్యాలయంలో చెప్తున్నారని, కావున అర్హులైన ప్రతి పేదవారికి రేషన్ కార్డు మంజూరు వెంటనే చేయాలని, ఈ రాజీవ్ యువ వికాసా పథకానికి ఇప్పుడు పెట్టినటువంటి కాలపరిమి తిని పొడిగించాలని డిమాండ్ చేశారు.

నేటి నుండి సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేటి నుండి తెలంగాణ వ్యాప్తంగా దొడ్డు బియ్యం స్థానంలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం కార్యక్రమం ప్రారంబించ నున్నట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే అన్ని చౌక ధరల దుకాణాలకు సన్న బియ్యం చేరాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభం చేస్తారని వివరించారు. దేశంలోనే మొదటి సారి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతున్నట్లు వెల్లడించారు. శనివారం హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు పంచాంగ శ్రవణం ఉంటుంది అందరూ పాల్గొన్నారు. పండుగ సందర్భంగా ప్రభుత్వం చాలా గొప్ప కార్యక్రమం ప్రారంభిస్తుందని వివరించారు. రేషన్ కార్డు హుస్నాబాద్‌లో ఉండి వాళ్ళు నివసిస్తున్న హైదరాబాద్‌లో కూడా బియ్యం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. మొన్న శాసన సభలో ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించుకున్నామని, రాబోయే కాలంలో తెలంగాణలో ప్రారంభించుకునే కార్యక్రమాలు ఆమోదించుకున్నామని అన్నారు. 2024-25, 2025-26 సంవత్సరానికి సంబంధించి ఇందిరమ్మ ఇళ్లు ప్రతి గ్రామానికి పారదర్శకంగా అర్హుల ఎంపిక జరుగుతుందన్నారు. హుస్నాబాద్‌లో309 పోలింగ్ స్టేషన్‌లు 160కి పైగా గ్రామాలు ఉన్నాయని, ఏప్రిల్ నెలలో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా కార్యక్రమం ద్వారా రైతులకు డబ్బులు వేయడం జరుగుతుందని అలాగే ఇందిరా భరోసా నిధులు మొదటి విడత పూర్తయ్యాయన్నారు. ఉగాది రోజు వెయ్యికి పైగా సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ గ్రామాల్లో జరుగుతుందని వెల్లడించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలతో గ్రామాల సమస్యల పై సమావేశాన్ని ఏర్పాటు చేశామని, గ్రామాల్లో ఎక్కడ కూడా నీళ్ళ కొరత ఉండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న గ్రామ కార్యదర్శి ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారం కాకపోతే నా దృష్టికి తీసుకురండి, తరువాత నిరసనలు చేసుకోండన్నారు. సీసీ రోడ్లు, ఈజీఎస్, పంచాయతీ రాజ్ ఆర్ అండ్ బి ద్వారా చేస్తున్నామని, కరీంనగర్ హుస్నాబాద్ నాలుగు లైన్ల రోడ్డుకు టెండర్ అయిందని చెప్పారు. మెడికల్ కాలేజి, నర్సింగ్ కాలేజి, లైబ్రరీ వచ్చిన స్థలాలు ఉండేలా ఏర్పాటు చేశామని చెపుకొచ్చారు. 75 సంవత్సరాల ప్రభుత్వ స్కూల్ ఉత్సవాల్లో పాల్గొన్నప్పుడు పలు సమస్యలు తీసుకొచ్చారని, వాటన్నిటినీ పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 4న పెద్దపల్లి సిఎం సభలో శాతవాహన యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కాలేజి ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని, 100 రోజుల్లో శాతవాహన యూనివర్సిటీకి హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజి మంజూరు అయిందన్నారు. దీనికి మహా సముద్రం గండి వద్ద స్థల సేకరణ చేశామని ఇప్పటికే లేవలింగ్ చేస్తున్నట్లు చెప్పారు. స్టాఫ్‌ని కూడా ఏర్పాటు చేస్తున్నామని, పారిశ్రామిక కారిడార్‌కి స్థల సేకరణ చేయడం జరిగింది, అందరూ సహకరిస్తున్నారు వారికి ధన్యవాదాలు తెలిపారు. అక్కన్నపేటకి కోటిన్నర రూపాయలతో మండల కార్యాలయ భవనానికి మంజూరయ్యాయన్నారు. హుస్నాబాద్ టౌన్‌లో అభివృద్ధి జరుగుతుందని, ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎక్కడ కూడా ఇళ్లలోకి వర్షపు నీరు రాకుండా చూడాలని అదేశించామని, పనులు కొనసాగుతున్నాయన్నారు.

ఒక్కరోజులో 3.25 లక్షల టన్నుల బొగ్గు రవాణా

ఉద్యోగులకు అభినందనలు తెలిపిన సీఎండీ ఎన్.బలరామ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి చరిత్రలో శుక్రవారం బొగ్గు రవాణాలో ఆల్ టైం రికార్డు నమోదయింది. మూడు షిఫ్టులలో కలిపి సింగరేణి మొత్తం మీద 3,25,243 టన్నుల బొగ్గును వినియోగదారులకు రవాణా చేశారు. దీనిలో రైల్వే రేకుల ద్వారా గత ఏడాదితో పోల్చితే అత్యధికంగా బొగ్గు రవాణా చేయటం కూడా మరో ఆల్ టైం రికార్డే. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి శనివారం ఉదయం డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో సమావేశం నిర్వహించి తన అభినందనలు తెలియజేశారు. అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లనే ఈ అరుదైన రికార్డు సాధ్యమైందనీ, ఇదే ఒరవడితో వర్షాకాలం వరకు అత్యధిక బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలని తద్వారా విద్యుత్ డిమాండ్‌కు తగినంత బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలన్నారు. రానున్న మూడు నెలల కాలంలో ఇదే విధంగా పని చేస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు గట్టి పునాది వేయాలని సూచించారు. దేశంలో విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయికి చేరుతున్నప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు వీలుగా మన రాష్ట్రంతోపాటు మనతో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ప్రణాళికాబద్ధంగా సరిపడా బొగ్గును సరఫరా చేయగలిగామన్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 7.24 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని గుర్తుచేశారు. రానున్న రోజుల్లోనూ ఇదే విధంగా అన్ని థర్మల్ కేంద్రాలకు సమృద్ధిగా బొగ్గు సరఫరా చేయడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. శుక్రవారం అత్యధికంగా బొగ్గు రవాణా జరగడంలో సంస్థ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, అన్ని గనులు, సి.హెచ్.పి.ల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా కృషి చేసి మంచి ఫలితాలు సాధించారని ఆయన అభినందించారు. కొత్తగూడెం నుంచి ఎక్కువ పరిమాణంలో బొగ్గు సరఫరా చేయడంపై ఆ ఏరియా ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కొత్తగూడెం వీకే ఓపెన్ కాస్ట్‌కు పర్యావరణ అనుమతులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్తగూడెం వెంకటేశ్ ఖని(వీకే) ఓపెన్ కాస్ట్ కు పూర్తిస్థాయి పర్యావరణ అనుమతులు లభించాయన్నారు. ఈ మేరకు ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్విరాన్మెంట్ అప్రైజల్ కమిటీ సమావేశంలో అనుమతులు లభించినట్లు వెల్లడించారు. వీకే ఓపెన్ కాస్ట్ ను అతి త్వరలో ప్రారంభించుకోబోతున్నామని, అనతి కాలంలోనే రొంపేడు ఓపెన్ కాస్టు (ఇల్లందు) గనికి కూడా అనుమతులు రానున్నాయని, కనుక వచ్చే ఏడాది నిర్దేశిత 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

నగరంలో కాల్పుల కలకలం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహానగరంలో మరోసారి కాల్పులు కలకలం రేపింది. వివరాల ప్రకారం హైదరాబాద్ నగరంలోని గుడి మల్కాపూర్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో ఆనం మీర్జా ఎక్స్పో జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రదర్శనలో ఇద్దరు దుకాణదారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే వారిలో ఒక దుకాణదారుడు గాలిలో కాల్పులు జరపడంతో అక్కడున్న వారిలో భయాందోళనకు గురయ్యారు. కాల్పుల శబ్దంతో సందడి నెలకొనగా, ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు గాలిలో కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఎక్స్పో నిర్వాహకులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఎక్స్పో ప్రాంతంలో భద్రతను పెంచినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సంఘటనతో ఎక్స్పోకు వచ్చిన ప్రజల్లో ఆందోళన నెలకొంది. అయితే, పోలీసులు వెంటనే స్పందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందని అక్కడి స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఇంకా వివరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

నేడు రవీంద్రభారతిలో శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మార్చి 30న ఉదయం 10 గంటలకు రవీంద్రభారతిలో 'శ్రీ విశ్వావసు' నామ ఉగాది వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కార్యాలయంలో ఉగాది వేడుకల నిర్వహణ గురించి వివిధ శాఖల అధికారులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ చర్చించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన అనుమతి, నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రిలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఉగాది "పంచాంగ శ్రవణం" ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించే 'శ్రీ విశ్వావసు' నామ ఉగాది వేడుకలలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ హమాలీ పోర్టర్స్ కూలి రేట్లు పెంచాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిజాం కాలంలో ఆర్టీసీ సంస్థ ఏర్పాటు అయినప్పటి నుండి సంస్థలో హమాలీ వ్యవస్థ కొనసాగుతున్నదని గత అనేక సంవత్సరాలుగా అమలు అవుతున్న బస్తా రేటును 2023 సంవత్సరంలో పది రూపాయలు ఉన్నటువంటి బస్తా రేటును ఐదు రూపాయలకు తగ్గించటం తీవ్ర అన్యాయమని పెరుగుతున్నటువంటి ధరలకు అనుగుణంగా 15 రూపాయల పెంచాలని మాజీ రాజ్యసభ సభ్యులు సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు టిజిఎస్ఆర్టిసి లైసెన్సు రిపోర్టర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో బస్ భవన్ ముందు భారీ ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణికులతో పాటు రవాణా వ్యవస్థ ద్వారా ఆర్టీసీకి అనేక లాభాలు వస్తున్నాయని ప్రస్తుతం కొనసాగుతున్నటువంటి కార్గో సంస్థలో రవాణా సంస్థ లాభదాయకంగా నడుస్తున్నదని, కానీ కార్మికుల కూలీ రేట్లు మాత్రం సగాని సగం తగ్గించడం ద్వారా వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు విమర్శించారు. వందలాదిమంది హమాలి పోర్టర్లు సీబీస్, జేబీఎస్, దిల్సుఖ్నగర్ లాంటి బస్టాండ్లతో పాటు రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో ప్రయాణికుల సరుకుల్ని రవాణా చేసేందుకు కృషి చేయుచున్నారని వారు తెలియజేశారు. గతంలో ఉన్న ఏఎన్ఎల్ ప్రైవేట్ సంస్థ లాంటి సంస్థల్లో కూడా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీరేట్లను పెంచే వారిని ప్రస్తుతం కార్పొరేషన్ ద్వారా నడుస్తున్న కార్గోలో కార్మికుల శ్రమ దోపిడి జరుగుతున్నదని వారు విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ హమాలీలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 20 శాతానికి తగ్గకుండా కూలీ రేట్లు పెంచాలని, ప్రతి పోర్టర్ కార్మికుడికి రెండు జతల యూనిఫారం సంస్థ ద్వారా ఇప్పించాలని, ఆసుపత్రిలో వైద్య సదుపాయాలపై హెల్త్ కార్డులు ఇవ్వాలని, పోర్టర్స్‌కు వారి కుటుంబాలకు ఆర్టీసీలో ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు పెరుగుతున్నప్పటికీ హమాలీ పోర్టర్స్ రేట్లు పెరగకపోవడం తీవ్ర అన్యాయమని వారు తెలియజేశారు. అనంతరం ప్రతినిధివర్గం ఆర్టిసి ఎండి సివి సత్యనారాయణ కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేవారు. సమస్యల పైన సానుకూలంగా స్పందించిన సజ్జనార్ వీలైనంత త్వరలో పరిష్కారం చేస్తామని రెస్ట్ రూములు హెల్త్ కార్డులు యూనిఫారం హమాలిరేట్ల పెంపుదలకు సంస్థ ద్వారా కృషి చేస్తామని డెలిగేషన్‌కు హామీ ఇవ్వడం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, యూనియన్ ఉపాధ్యక్షులు జి దాసు, వి పోచయ్య, కే కొండయ్య ఇ దశరథ్, కే చంద్రమౌళి, జి.నరసింహ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మైనంపల్లి హన్మంతరావు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన రాజు స్థానిక ముస్లిం పెద్దలు కమర్‌తో కలిసి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంత రావు మాట్లాడుతూ గంగా, జమున, తెహజీబ్ అలాగే హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనే విధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలిచింది అన్నారు. తెలంగాణ హిందూ సోదరులకు ఉగాది శుభాకాంక్షలు, ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, ఆర్.ఎస్.ఎస్ ముస్లిం మంచ్ సౌత్ ఇండియా అధ్యక్షులు సత్తార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు వినోద్ యాదవ్, మైనారిటీ నాయకులు ఫరీద్, షకీల్, ఫరూక్, ఖుద్దూస్, క్రాంతి, దాస్, ఇస్తారీ పాల్గొన్నారు.

జలమండలిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రానికి కేటాయిం చిన 2023 బ్యాచ్‌కి చెందిన ఏడుగురితో కూడిన ట్రైనీ ఐఏఎస్ బృందం జలమండలిని సందర్శించింది. ఒకరోజు ఒరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి విచ్చేసి జలమండలి కార్యకలాపాల గురించి వారు తెలుసుకున్నారు. ఎండీ అశోక్ రెడ్డి బోర్డు పనితీరు, నగరానికి నీటి సరఫరా, ఎస్టీపీలు, మురుగు శుద్ధి నిర్వహణతో పాటు.. భవిష్యత్తు ప్రణాళికలు, ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. కోటి 30 లక్షలకు పైగా జనాభా ఉన్న హైదరాబాద్ మహా నగరానికి భారీ పైపు లైన్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్న పద్ధతిని తెలిపారు. దీంతో పాటు నీటి శుద్ధి, వివిధ దశలలో నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియ, క్లోరినేషన్, తుది దశగా హైదరాబాద్‌కు భారీ మోటర్లతో పంపింగ్ వంటి అంశాల గురించి వివరించారు. నగర ప్రజలకు సుదూర ప్రాంతాల నుంచి సరఫరా చేసే విలువైన నీటిని వృథా చేయకుండా జలమండలి ఎప్పటికప్పుడు చేపట్టే అవగాహన కార్యక్రమాల్ని వివరించారు. వాన నీటి సంరక్షణ పద్ధతులను వివరించే థీమ్ పార్కును జలమండలి నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ థీమ్ పార్కులో భవిష్యత్తు తరాలకు వాన నీటిని ఎలా ఒడిసి పట్టాలో తెలిపే వివిధ పద్ధతుల్ని ఉన్నట్లు వివరించారు. వీటితో పాటు రాబోయే 25 ఏళ్లలో చేపట్టే భవిష్యత్తు కార్యాచరణ గురించి కూడా తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ సమ్మర్ ఆక్షన్ ప్లాన్ లతో వేసవిలో హైదరాబాద్ నగరంలో తాగునీటి ట్యాంకర్ బుకింగ్ సరళి డెలివరీ వివరాలతో పాటు గత ఏడాదికంటే 60 శాతం పెరిగినా 98శాతం ట్యాంకర్లను 24గంటల్లో డెలివరీ చేస్తున్నట్లు వివరించారు. జలమం డలి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్ స్పెషల్ డ్రైవ్ గురించి వివరించారు. జలమండలి పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సిబ్బంది, అధికారులు సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హెూళ్లలో పూడికతీత పనులు రోజూ చేపడుతున్నారని అన్నారు. ఒకవైపు రోజూ వారీగా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుకుం టూనే.. మరోవైపు స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పనులు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం చేపడంవల్ల ఎంసీసీ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు తగ్గినట్లు ఈడీ చెప్పారు. ఈఎన్సీ అండ్ డైరెక్టర్ ఆపరేషన్ -2 వీఎల్ ప్రవీణ్ కుమార్.. జలమండలిలో చేపట్టిన వివిధ సంస్కరణలు, రెవెన్యూ, ఐటీతో పాటు.. ఇప్పటి దాకా చేపట్టిన ప్రాజెక్టులు కృష్ణా, గోదావరి, హడ్కో రిజర్వాయర్లు, ఓఆర్ఆర్ ఫేజ్- 1, 2 ప్రాజెక్టులు, వంద శాతం మురుగుశుద్ధి కోసం చేసే ఎస్టీపీల ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఆపరేషన్స్-1 డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సిజిఎం (పి అండ్ ఏ) మహ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

ఘనంగా 4వ కియో నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ ముగింపు పోటీలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి లోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అథారిటీ అఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "4వ కియో నేషనల్ కరాటే ఛాంపియన్షిప్" పోటీల ముగింపు కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ పలువురు ప్రముఖులతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని కరాటేలో గెలుపొందిన వారికి మెడల్స్, అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్ యాదవ్ తెలంగాణ కరాటే అసోసియేషన్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ డిపో దగ్గర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరి శంకర్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, నాయకులు మనోరంజన్ రెడ్డి, ప్రభు, నాగిరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

విశాలాంధ్ర- అమనగల్లు : పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని టీడీపీ యువ నేత బాదేపల్లి రాజు గౌడ్ ఆధ్వర్యంలో అమనగల్లు పట్టణంలో పేద ముస్లింలు, వృద్ధులు, వితంతువులకు రంజాన్ తోఫా కిట్‌లను పంపిణీ చేశారు. పేదలను ఆదుకునే దయాగుణం ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని చెప్పారు. ఫలితంగా అల్లాహ్ దయ, కరుణ, కటాక్షం లభిస్తాయని ఆయన వివరించారు.

ఉత్తమ విద్యార్థికి లయన్స్ క్లబ్ చేయూత

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: చదువులో రాణిస్తున్న ఉత్తమ విద్యార్థికి లయన్స్ క్లబ్ హెూప్ చేయూత అందించింది. చందానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హెూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కొండ విజయ్ కుమార్ విద్యాలో రాణిస్తున్న కార్తీక్ 10వ తరగతి విద్యా కోసం రూ.25 వేల రూపాయల చెక్కును అందచేయడం జరిగింది. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ ట్రెజరర్ మర్రి ప్రవీణ్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ శ్రీధర్, రీజియన్ అధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, లయన్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని తొలగించడం దారుణం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు చలివేంద్రాలు కూడా పెట్టుకునే అవకాశం లేకుండా పోయిందని మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాజిగిరి చౌరస్తాలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటీవల చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ చలివేంద్రాన్ని మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ రాజు తొలగించడం దారుణం అన్నారు. ప్రతిదీ రాజకీయ కోణంలో చూడడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తుపాకుల జనార్ధన్, చిన్న యాదవ్, బాబు రావు, నవీన్ యాదవ్ పాల్గొన్నారు. చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహం పూర్తిగా కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేయడంతో ఈ విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో షెడ్డును తొలగించాల్సి వచ్చిందని ఉప కమిషనర్ రాజు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర - మేడిపల్లి : ఒక వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెంగిచెర్ల పరిధిలో నివసించే నర్మద లక్ష్మి, భర్త రతన్ దీప్ (42) వారి పిల్లలతో గత మూడు నెలల నుంచి చెంగిచెర్లలో నివసిస్తు న్నారు. రతన్ దీప్ ప్రస్తుతం మహబూబ్‌నగర్ లోని కస్టమ్స్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్నాడు. ఇతను కొంతకాలంగా మద్యానికి బానిసై డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. 28వ తేదీ ఉదయం 7.30 గంటలకు తన భార్య నర్మదకు తను రాత్రి తన స్కూటీని వైన్ షాప్ దగ్గర మర్చిపోయానని చెప్పి, తీసుకొస్తానని ఇంటి నుండి వెళ్లడం జరిగింది. కానీ తిరిగి రాకపోవడంతో భార్య నర్మద మేడిపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయడంతో మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాటర్ ట్యాంక్ నడిపితే చర్యలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : హైదరాబాద్ సిటీలో ప్రతినిత్యం వాటర్ ట్యాంకర్ల వాహనాలను డ్రైవర్లు అతివేగంతో నడిపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వాహన ప్రమాదంలో అమాయకుల ప్రాణాలు బలిగొన్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్స్‌లను ముఖ్యంగా ఎస్‌ఆర్ నగర్ పరిధిలో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లను హెచ్చరిస్తూ ఎస్‌ఆర్ నగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సైదులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి డ్రైవర్ వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌కి బ్రీత్ అనలైజర్ చేయడం జరుగుతుందన్నారు. శనివారం మూసాపేట్‌కి చెందిన శ్రీవాణి వాటర్ సప్లై కేంద్రానికి చెందిన టాంకర్ వాహనం డ్రైవర్‌కి బ్రీత్ అనలిస్ టెస్ట్ నిర్వహించగా అతనికి BAC 181/100 mg గ్రాములు రావడంతో వాహనంను స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఇక మీదట వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు బ్రీత్ అనలైసెర్ చేస్తామన్నారు.

విద్యార్థుల యూనిఫాంలు నాణ్యతగా ఉండాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల రీ ఓపెనింగ్ రోజున ప్రతి విద్యార్థి స్కూల్ యూనిఫామ్స్‌తో పాఠశాలలకు రావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ చంద్రకాంత్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 772 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 1,03,912 మంది విద్యార్థిని విద్యార్థులకు రెండు జతలు చొప్పున స్కూల్ యూనిఫాంలు నిర్దేశించిన సమయం నాటికి అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ముందుగా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ అధికారులు నాణ్యమైన క్లాత్‌ను ఏప్రిల్ 3 నుండి 5 వరకు విద్యాశాఖకు అందించాలని సూచించారు. జిల్లాలోని మండలాల వారీగా స్వయం సహాయక సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టేందుకు సంఘాలకు అప్పగించాలని అలాగే విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థి పాఠశాలల రీఓపెనింగ్ రోజున నూతన యూనిఫామ్‌తో వచ్చేలా దుస్తులు అందచేస్తున్నందున అదిశగా పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత సంవత్సరం స్వయం సహాయక సంఘాలకు యూనిఫామ్స్ స్టిచ్చింగ్ చార్జీలు రూ. ఒక కోటి 50 లక్షలు చెల్లించటం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల దుస్తుల సంఖ్య వివరాలను అందరి వద్ద ఉండాలని అలాగే ఏ ఒక్క విద్యార్థికి కూడా దుస్తులు అందలేదని కంప్లైంట్స్ రావద్దని సూచించారు. పాఠశాలల రీఓపెనింగ్ సమయం ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున స్వయం సహాయక నైపుణ్యత గల టైలర్లతో సంఘాలకు యూనిఫామ్‌ల కటింగ్, స్టిచ్చింగ్‌లపై శిక్షణ ఇప్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో ఆర్ రోహిణి, వివిధ శాఖల సంక్షేమ అధికారులు డిప్యూటీ డిఈఓ లు, డిపిఓలు, జిహెచ్‌ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ (లోక్ నియోజకవర్గాల పునర్ విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. నియోజకవర్గాల పునర్ విభజనను మరో 25 ఏళ్ల పాటు నిలిపివేయాలి. ఒక వేళ కేంద్రం ఇప్పుడే చేపడితే జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రం యూనిట్ ప్రస్తుతం ఉన్న ఎంపి స్థానాలలో 2:1 నిష్పత్తి ప్రకారం నియోజకవర్గాలను పెంచాలి" అని 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' అఖిలపక్ష సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నియోజక వర్గాల పునర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని, జనాభా నియంత్రణను విజయవంతం చేసి దేశాభివృద్ధికి తోడ్పడుతున్న రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని అఖిలపక్ష సమావేశం హెచ్చరించింది. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ విభజనపై 'తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్' అధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం శినవారం హైదరాబాద్ ప్రెస్ జరిగింది. సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించారు. మాజీ ఎంఎల్ కె.యాదవ్ రెడ్డి ఎంపి నియోజకవర్గాల పునర్ విభజనపై వివరాలతో ఒక ముసాయిదా నివేదికను ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గాల పునర్ విభజనలో కేవలం జనాభానే కాకుండా జిడిపి, మానవ వనరుల అభివృద్ధి సూచిక, అక్షరాస్యత తదితర అంశాలలో దేశాభివృద్ధికి రాష్ట్రాలు చేస్తున్న కృషిని కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. టిపిసిసి ఉపాధ్యక్షులు ఎం.ఆర్.జి.వినోద్ రెడ్డి మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన లోక్ నియోజకవర్గాల పునర్ విభజన చేయడం ద్వారా దక్షిణాదికి సీట్లు తగ్గించి ఉత్తరాదికి సీట్లు పెంచుకోవడం ద్వారా బిజెపి తన రహస్య ఏజెండాను అమలు చేసుకునే కుట్ర దాగి ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ బిజెపి తన రాజకీయ అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకు జనాభా ఆధారంగా దక్షిణాది రాష్ట్రాల లోక్ సీట్లను తగ్గించాలని అప్రజాస్వామికంగా, దుర్మార్గంగా ఆలోచన చేస్తుందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన లోక్ సీట్లను విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాల సీట్లు 27.4 శాతం నుంచి 19.1 శాతానికి తగ్గిపోతాయని, అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల సీట్లు 40 శాతం నుంచి 46 శాతానికి పెరుగుతాయని, తద్వారా దేశంపై పెత్తనం చేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. విద్యావేత్త మధుసూదన్ మాట్లాడుతూ లోక్ సీట్ల ఆధారంగానే రాజకీయ పార్టీలు మంత్రి పదవులను పంపిణీ చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కాపాడుతూనే నియోజకవర్గాలను పెంచాలని, అప్పుడే ఎంపి, ఎంఎల్ ఎంఎల్ సీట్ల సంఖ్య పెరిగి అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ రాష్ట్రాల హక్కులు, ప్రయోజనాల విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవరిస్తూ ఫెడరల్ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుందన్నారు. వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు ఎం.జగన్ (ఐఫ్టు), నారాయణ (బ్లసమ్ విద్యా సంస్థల అధినేత), తిప్పర్తి యాదయ్య, ఉపేందర్, పార్వతి (తెలంగాణ విద్యావంతుల వేదిక), మల్లంగి విజయ్, జావెద్ షరీఫ్, డాక్టర్ లక్ష, మౌనిక, దర్శనం రమేష్, ధర్మేందర్ తివారి, ఖాన్, కోడంగల్ శ్రీనివాస్, అజీమ్, పవార్, షబాజ్, సత్యనారాయణ రెడ్డి(ఆప్), ఎం.వేణు (టిజెఎస్) ప్రసంగించారు.

పేద ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే రంజాన్ తోఫా పంపిణీ

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పేద ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రంజాన్ పండుగ భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు పేద ముస్లింలకు రంజాన్ తోఫా కింద నిత్యవసర వస్తువులను అందజేశారు. రంజాన్ పండుగ రోజున ప్రత్యేక వంటకం అయిన "శీర్ ఖుర్మా" కు సంబంధించిన నిత్యవసర వస్తువులను పేదలకు పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు వేల మందికి రంజాన్ తోఫా అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా షాద్‌నగర్ పట్టణంలో దాదాపు 1000 మంది ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని ప్రతి పేద ముస్లిం ఘనంగా జరుపుకోవాలని, తను గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏడాది రంజాన్ పండుగను పురస్కరించుకొని నిరుపేదలకు రంజాన్ తోఫాను అందజేస్తున్నట్లు తెలిపారు. పవిత్రమైన రంజాన్ దినాన శీర్ ఖుర్మా వంటకం ప్రత్యేకమని, దీనిని ప్రతి ఒక్కరు సేవిస్తారని మతసామరస్యంతో అన్ని వర్గాలు సేమియా పాయసాన్ని తింటాయని పేర్కొన్నారు. పండగపూట నిరుపేద మహిళలు ఎవరు పస్తులు ఉండకూడదు అన్న మంచి ఉద్దేశంతో తన వంతు సాయంగా రంజాన్ తోఫాను ప్రత్యేకంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నెల రోజులపాటు పవిత్ర రంజాన్ మాసంలో కఠినమైన ఉపవాస దీక్షలు చేసి చివరగా అల్లాను ప్రసన్నం చేసుకోవడానికి జరుపుకునే ఈదుల్ ఫితర్ పండుగ ఎంతో గొప్పదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ముస్లిం కుటుంబం సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, ఇబ్రహీం, జమ్రుత్ ఖాన్, సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, షర్ఫోద్దీన్, వీర్లపల్లి అన్వర్, సుదర్శన్ గౌడ్, అశోక్ పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ సమస్త ప్రజలకు, కార్పొరేటర్లకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయభిలాషులకు, పాత్రికేయ మిత్రులకు, అభిమానులకు శ్రీ విశ్వావసు నామ నూతన సంవత్సర (తెలుగు) ఉగాది పర్వదిన శుభాకాంక్షలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఉగాది పర్వదినంన ప్రజలు అందరూ సుఖ శాంతులతో గడపాలని ఆకాంక్షించారు. అదేవిధంగా షడ్రుచుల సమ్మేళనం సంబరాల సూర్యోదయం భవితల పంచాంగ శ్రవణం వసంత కోయిల గానంతో పాటు వచ్చేదే తెలుగు వారి పండగ ఉగాది. ఈ నూతన తెలుగు సంవత్సరంలో మీ జీవితం కొత్త ఆశలు, ఆశయాలు, ఆలోచనలతో నవ వసంతం ఆనందమయం కావాలని ఆశిస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజానీకానికి, తెలుగు ప్రజలందరికి శ్రీ విశ్వావసు సంవత్సర 2025-26 తెలుగు నూతన సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు చలివేంద్రాలు ప్రారంభం : తుంగతుర్తి రవి

విశాలాంధ్ర - మేడిపల్లి : ప్రతియేటా ఉగాది పర్వదిన సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆర్. వి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివెంద్రాల ప్రారంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అదే పరంపరలో ఈ సంవత్సరం కూడా 30వ తేదీ ఆదివారం పలు ప్రాంతాల్లో చలివెంద్రాల ప్రారంభోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవకులు, వివిధ కాలనీల కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, చలివేంద్ర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయగలరని మనవి. హనుమాన్ గుడి, విష్ణుపురి కాలనీలో ఉదయం 10:00 గంటలకు శ్రీ వీరాంజనేయ స్వామి గుడి, మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉదయం 10:30 గంటలకు చలి చలివెంద్రాలను ప్రారంభించనున్నట్లు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి. ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుంగతుర్తి రవి తెలిపారు.

పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలి

విశాలాంధ్ర - కాప్రా : పండుగలు మతసామరస్యాలకు ప్రతీకగా నిలవాలని, వాటిలో దాగి ఉన్న ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ కె.నవనీత రావు సూచించారు. నాచారం డివిజన్ పరిధిలోని దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో శనివారం ఉగాది, రంజాన్ వేడుకలను విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు వేడుకలతో పాటు సాంప్రదాయ నృత్యాలు, పోటీలు నిర్వహించారు. అనంతరం నవనీత రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎదుటివారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. ప్రతి పండుగలో ఒక పరమ అర్థం దాగి ఉందని దానిని ప్రతి ఒక్కరు గ్రహించాలని సూచించారు. పండుగలు ఐక్యతకు మూలంగా నిలవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో అన్ని మతాలను గౌరవిస్తూ ప్రతి పండుగను ఎంతో గొప్పగా జరుపుకుంటామని తెలిపారు. వీటివల్ల విద్యార్థుల్లో ఒకరి పట్ల ఒకరికి గౌరవం పెరిగి, ఐక్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, కోర్ హెడ్స్ ఆపరేషన్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుమామీనన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఏవీఆర్ చికిత్సతో వృద్ధుడి ప్రాణాలు కాపాడిన ఆలివ్ ఆసుపత్రి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఆరోగ్య సంరక్షణలో విశ్వసనీయత, మెరుగైన ఆరోగ్య ఫలితాలతో ప్రాణాలకు కాపాడటంతో అద్వితీయంగా ఆలివ్ హాస్పిటల్ కృషి చేస్తుందని కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ఆలివ్ ఆస్పత్రి డాక్టర్ కృతిక్ కులకర్ణి తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో అత్యంత క్లిష్టమైనది ట్రాన్స్కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్మెంట్ (టిఏవీఆర్) ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్టు వెల్లడించారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రంగంలో ఈ విప్లవాత్మక శస్త్రచికిత్స ప్రక్రియను ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ కృతిక్ కులకర్ణి, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మొహమ్మద్ ఆసిఫ్‌లతో కూడిన వైద్య బృందం విజయవంతంగా శాస్త్ర చికిత్స నిర్వహించినట్లు వెల్లడించారు. తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్, రెగర్జిటేషన్ ఉన్న వృద్ధి రోగులకు టిఏవిఆర్ ఒక ప్రాణాలను రక్షించే పరిష్కారం అని, సాంప్రదాయ ఓపెన్-హార్ట్ సర్జరీకి ఇదొక ఇన్వాసివ్ ప్రత్యామ్నాయం అన్నారు. అత్యంత ప్రమాదకర స్థాయిలో, సాంప్రదాయ గుండె శస్త్రచికిత్స చేయించుకోలేని రోగులకు సురక్షితమైన, మరింత ప్రభావవంతమైన ఈ చికిత్సను మాత్రమే అందిస్తామన్నారు. తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్, రెగర్జిటేషన్తో బాధపడుతున్న వృద్ధి రోగులకు ఇదొక సంజీవనీల పనిచేస్తుందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

విశాలాంధ్ర- దుండిగల్: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది నిరుపేదలు వైద్య సేవలు పొందుతున్నారని నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి జిహెచ్ఎంసి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ, కొంపల్లి మున్సిపాలిటీ ప్రాంతాలకు చెందిన దాదాపు 139 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు సుమారు 47 లక్షల రూపాయల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయా డివిజన్లకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధ్యక్షులు, నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతీ ఒక్క నిరుపేదను అదుకుంటూ భరోసా కల్పించే నాయకులు, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని, అనారోగ్య సమస్యతో ఆసుపత్రుల పాలై ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మహమ్మద్ రషీద్ రఫీ, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, గౌరిష్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు మక్సుద్ అలీ, గుబ్బల లక్ష్మీనారాయణ, శేఖర్‌రావు, గౌస్, బస్వరాజు, సంపత్ మాధవ రెడ్డి, సుధాకర్ గౌడ్, గుమ్మడి మధుసూదన్ రాజు, కిషోర్ చారి, ప్రభాకర్ గుప్తా, మహమ్మద్, అజం, ఓంకార్ రెడ్డి, నదీమ్ రాయ్, బొంబాయి శ్రీను, ఈశ్వర్ గౌడ్, ప్రకాష్ లింగాయత్, తోకల నగేష్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, యేసు, విజయ్ హరీష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ అవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజక వర్గంలో తెలుగు దేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి సఫిల్ గూడ చౌరస్తా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి కేక్ కటింగ్ చేశారు. గాంధీ నగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ముఖ్య అతిధులుగా టీటీడీ బోర్డు మెంబెర్ నన్నూరి నర్సి రెడ్డి, మరియు మల్కాజ్గిరి పార్లమెంట్ అధ్యక్షుడు కందికంటి అశోక్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. మల్కాజిగిరి కోఆర్డినేటర్లు కరణం గోపి, ఒగ్గు చంద్రశేఖర్ రావు, పిట్ల రామకృష్ణ ముదిరాజ్, గొల్లగూడ శ్రీనివాస్, గుంటి భీమ్ రాజ్, గుర్రా రాజు గౌడ్, ఎస్ రమేష్, తిక్క ప్రకాష్, నాగమణి, నరసమ్మ, సుధాకర్, సుమన్, సుందర్, శ్రీనివాస్, భాస్కర చారీ, వీరేష్, మధు, సుబ్బారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రాలో : బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని జిల్లా సంయుక్త కార్యదర్శి రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో రాంచందర్ గౌడ్ ఆధ్వర్యంలో టీడీపీ జెండా ఎగరవేసి కేక్ కట్ చేసి అనంతరం పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కీసర ప్రేమ్ కుమార్ గౌడ్, కే.కృష్ణారావు, ఆర్.నాదం గౌడ్, సత్యం యాదవ్, ఎన్.బాలకృష్ణ గౌడ్, టి.బీరప్ప, సిహెచ్ వెంకటేష్, డి.కృష్ణ ఉత్తిష్ట, ఎస్.అశోక్ గౌడ్, పి.శ్రీనివాస్, రాంబాబు, ఆదినారాయణ, గిరి రాంబాబు, బార్కి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజికవర్గం గౌతమ్‌నగర్ డివిజన్‌లో చింతల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ 43వ అవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు డా.పోగాకు జైరామ్ చందర్గారు పాల్గొని, తెలుగు దేశం పార్టీ జెండాను ఎగురవేసి, కేకు కట్ చేశారు. అనంతరం డా. పోగాకు జైరామ్ చందర్గారు మాట్లాడుతూ, "స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి స్థాపించారు అని అన్నారు. తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని డా. పోగాకు జైరామ్ చందర్ పిలుపునిచ్చారు. గౌతం నగర్ డివిజన్ అధ్యక్షులు పితాని సత్యనారాయణ, ప్రణయ్ చంద్ర, సీఎండీసీ నేషనల్ ప్రెసిడెంట్ రామ్ మోహన్, బత్తిని నరసింహ, రూపేష్, అవినాష్ రెడ్డి, అవినాష్ గౌడ్, పరమేశ్, మౌలాలీ, అన్వేష్, అనూషా, రాధికా, మేఘనా, వెంకటరమణ, బాలరాజ్ యాదవ్, అంజిరెడ్డి, డా. కృష్ణ, జీలా రాములు, రామనయ్య, బొమ్మ భాను, సాయి కిరణ్ రెడ్డి, రమేష్, వర్షిత్, సాయి కిరణ్, సుదర్శన్ గౌడ్, సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : శనివారం ఎన్‌టిఆర్ భవన్‌లో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం వేడుకను తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. తదనంతరం నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే అంకిత భావంతో హైదరాబాద్‌లోని న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి ఇప్పటికి 43 సంవత్సరాలు అయిందన్నారు. రూ.2 కే కిలో బియ్యం, సగం ధరలకే జనతా వస్త్రాలు, పక్కా గృహాలు, ఆదరణ, వెలుగు, ముందడుగు వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ఎన్‌టిఆర్, చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ అమలు చేసిందని అన్నారు. పార్టీ నాయకులు, పోలంపల్లి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ తెలుగు దేశం పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారం లోకి వచ్చి చరిత్ర సృష్టించిందన్నారు. జాతీయ పార్టీ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న, ఏపీ మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, జివిజి నాయుడు, వేజెండ్ల కిశోర్ బాబు, ముంజా వెంకట్రాజం గౌడ్, జలమోని రవీందర్, రత్నాకర్‌రావు, అమర్‌నాథ్‌బాబు, కట్టా రాములు, బాల సుబ్రమణ్యం, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నందమూరి తారకరామారావు ఫోటోకు పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. జెపి నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి, సిద్ధిక్ నగర్ పార్టీ కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అలాగే మియాపూర్ 108 డివిజన్లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద టిడిపి పార్టీ జెండా వందనం నిర్వహించి మియాపూర్ 108 డివిజన్ తెలుగుదేశం పార్టీ యూత్ నాయకులు నల్లమల రాకేష్ చౌదరి, క్రరీ నానిల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 43 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 43 కేజీల కేకును కట్ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సామా భూపాల్ రెడ్డి విచ్చేసినారు. అదేవిధంగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్‌కట్టా. వెంకటేష్ గౌడ్ ఈ సభకు అధ్యక్షత వహించారు. తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి పదం వైపు ఒక విజన్‌తో పనిచేసి అభివృద్ధిని చేసి చూపిస్తున్న వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. శ్రీహరి యాదవ్, విజయ్ కృష్ణ, కోటేశ్వరరావు, పోలిన సుబ్బారావు, అట్లూరి చిట్టిబాబు, ఆనంద్, ఈశ్వర్ గౌతమ్, శ్రవణ్ నల్లమల రమేష్, కార్యకర్తలు నాయకులు విశేషంగా పాల్గొని దిగ్విజయం చేయడం జరిగినది. కట్టా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ప్రజల మన్ననలను పొందుతూ ఈ రోజున 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఒక పండగ వాతావరణంగా జరుపుకోవడం మనందరి అదృష్టమన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాజ్‌భవన్‌లో రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యాలతో అలరించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కళాకారులను అభినందించారు. హ్యాపీ రాజస్థాన్, ఒడిశాడేగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు ప్రముఖులు, అధికారుల పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల రక్షణకు మోదీ అబద్ధాలు

రూ.16 లక్షల కోట్ల ఎన్‌పీఏలు నిజం కాదా?

నారాయణ సూటిప్రశ్న

న్యూఢిల్లీ: కార్పొరేట్ సంస్థలను కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ అబద్ధాలు చెప్పడం విచారకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ విమర్శించారు. ఒక ప్రముఖ ఛానల్ నిర్వహించిన సమ్మిట్‌లో ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి లేదని, అభివృద్ధి పెరిగిందని, కాంగ్రెస్ హయాంలో అవినీతి విశృంఖలంగా పెరిగిందని చెప్పడం సత్య దూరమని నారాయణ అన్నారు. ఎన్‌పీఏ కింద రూ.16 లక్షల కోట్లు ఉన్నాయని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ స్వయంగా చెప్పారని ఆయన గుర్తుచేశారు.

2014 కంటే ముందు ఎన్‌పీఏలు రెండున్నర లక్షల కోట్లు ఉంటే... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.16 లక్షల కోట్లకు పెరిగాయని నారాయణ ధ్వజమెత్తారు. డబ్బుల ఎగవేతలో విజయ్ మాల్యా మినిహా... 28 మంది గుజరాత్ రాష్ట్రానికే చెందినవారని, ఎక్కువ మొత్తం బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే మొండి బకాయిల పేర్ల మీద కార్పొరేట్ పెద్దలకు రుణాలు మాఫీ చేశారన్నారు. భారతదేశంలో ఉన్న బిలియనీర్లు బయటికి వెళ్తామని చెప్పారని, ఇది దేశ సంపద తరలిపోయేది కాదా అని ప్రశ్నించారు. అభివృద్ధిలో భారతదేశం మూడో స్థానంలో ఉందని బొంకుతున్నారని, కానీ 170 దేశాల ఆకలి సూచీలో భారతదేశం 112వ స్థానం ఉన్నదని, పేదల జీవన ప్రమాణాలు పెరగలేదని ఈ గణాంకాలు సూచించడం లేదా అని నిలదీశారు. సత్వరమే కేసులు పరిష్కరిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌లో ఒక చిన్నారిపై జరిగిన అఘాయిత్యం కేసుపై 20 రోజులలోనే చర్యలు తీసుకున్నామని చెబుతున్న ప్రధాని మోదీ... 11 ఏళ్లుగా ఆర్థిక కేసులు ఎదుర్కొంటూ జగన్ జైలు బయటనే ఉన్నారని, కోడి కత్తి కేసు, వైయస్ వివేకానంద రెడ్డి కేసులో ఉన్న ముద్దాయికి ఎందుకు శిక్ష పడటం లేదని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్వేశ్వర శర్మకు 'సైన్స్ పాపులరైజేషన్' అవార్డు

హైదరాబాద్: ప్రముఖ రచయిత సర్వేశ్వర శర్మను 'సైన్స్ పాపులరైజేషన్' అవార్డు వరించింది. శర్మకు ఈ అవార్డును అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఏఎస్‌టీసీ) ప్రకటించింది. ఏప్రిల్ 22న హైదరాబాద్‌లో జరగబోయే ఏఎస్‌టీసీ వార్షిక సదస్సు సందర్భంగా పురస్కారాన్ని అందజేస్తారని అకాడమీ కార్యదర్శి సీఎల్ నరసింహా రావు వెల్లడించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఏఎస్‌టీసీ కమ్యూనికేషన్స్, ఏఎస్‌టీసీ- వ్యవస్థాపకోపన్యాసం, ఎర్త్ డే-డాక్టర్ ఎస్.బాలకృష్ణ స్మారకోపన్యాసం ఉంటాయని అన్నారు. ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లోగల భాస్కర ఆడిటోరియంలో ఏఎస్‌టీసీ పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందని నరసింహారావు వెల్లడించారు.

చంద్రబాబు, నితీశ్ వ్యతిరేకిస్తే

వక్ఫ్ బిల్లుకు ఆమోదం కలే: ఒవైసీ

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రం తెచ్చిన వక్ఫ్‌సవరణ బిల్లుపై దేశవ్యాప్తంగా నిరసన వెల్లువెత్తుతోంది. ఈ బిల్లును ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ ఎన్‌డీఏలో భాగస్వాములైన చంద్రబాబు, నితీశ్‌కుమార్ మద్దతివ్వకపోతే ఈ బిల్లు ఆమోదం పొందదన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'చంద్రబాబు, నితీశ్‌కుమార్ ఊతకర్రలపై ప్రధాని నరేంద్రమోదీ ఆధారపడుతున్నారు. వక్ఫ్‌బిల్లు గురించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారు. రాజ్యాంగ విరుద్ధమైన చట్టం చేయడానికి మోదీ సర్కారు ప్రయత్నిస్తున్నది. ఇది రాజ్యాంగంలోని అధికరణలను ఉల్లంఘించడమే. వక్ఫ్ సవరణ వల్ల దేశవ్యాప్తంగా నష్టం జరుగుతుంది. ప్రధానంగా వక్ఫ్ ఆస్తిలోని విభాగాన్ని సవరణ ద్వారా తొలగిస్తున్నారు. దీనివల్ల ఎవరు ప్రయోజనం పొందుతారు. ఈ నిర్ణయంతో లక్షల రూపాయల ఆదాయాన్ని వక్ఫ్ నుంచి తొలగిస్తున్నారు. దీనిపై వక్ఫ్ ట్రిబ్యునల్ కోర్టులో సవాల్ చేయవచ్చని అమిత్ షా దేశానికి అబద్ధం చెబుతున్నారు. ప్రధాని మోదీ... చంద్రబాబు, నితీశ్‌కుమార్ మద్దతుపై ఆధారపడుతున్నారు. ఈ రాజ్యాంగ విరుద్ధమైన బిల్లుకు వారు మద్దతు ఇవ్వకపోతే ఆమోదం లభించడం దుర్లభం' అని ఒవైసీ అన్నారు.

జమిలీ ఎన్నికలు దేశ ప్రగతికి మూలం: వెంకయ్య నాయుడు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): జమిలీ ఎన్నికలు దేశ ఆర్థిక పురోభివృద్ధికి, దేశ ప్రగతికి మూలమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వెన్యూ కన్వెన్షన్‌లో శనివారం 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' అనే అంశంపై విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి బి. శివ శంకర్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి అంటూ తెలుగు వత్సర శుభాకాంక్షలు తెలిపారు. జమిలీ ఎన్నికలపై పూర్తిస్థాయిలో చర్చ జరగాలని అన్నారు. పదవీవిరమణ చేశా కానీ ప్రజాజీవితంలో పదవీ విరమణ చేయలేదని పేర్కొన్నారు. జెమిలీ ఎన్నికలను కొందరు ఎందుకు వ్యతిరేకిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఇది మోదీ నిర్ణయం కాదని, ఒకేసారి ఎన్నికలు జరిగితే కేంద్రానికి లాభమని, రాష్ట్రానికి నష్టం అనే వాదనలో పసలేదన్నారు. సమర్థవంతంగా పరిపాలించే వారికి ప్రజలు విచక్షణ శక్తితో నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

జమిలీ ఎన్నికలు బీజేపీ కి లాభం అనే అపోహలు వీడాలన్నారు. ఫిరాయింపు చట్టం తేవాలని, అప్పులు చేయొద్దని సూచించారు. అనేక దేశాలలో ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. చదువు, వైద్యానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ జరగాలని అనేక కమిటీలు సిఫారసులు చేస్తున్నాయని స్పష్టం చేశారు. బి.శివ శంకర్ మాట్లాడుతూ... దేశంలో ఒకేసారి ఎన్నికలు జరిగితే రూ.50 వేల కోట్ల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. 1984లో వెంకయ్య నాయుడు ఒకే ఎన్నిక ఒకే దేశం ప్రతిపాదన తెచ్చారని గుర్తు చేశారు. ఆరోగ్య శాఖామంత్రి వై.సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు యలమంచిలి సుజనా చౌదరి, కామినేని శ్రీనివాసరావు, పార్థసారథి, ఒకే దేశం ఒకే ఎన్నిక కన్వీనర్ ఏటుకూరి సూర్యనారాయణ రాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, విట్ కాలేజీ వైస్ ఛాన్సలర్ కోటారెడ్డి, మిర్చి అసోసియేషన్ నేత వెలగపూడి సాంబశివరావు, కాన్ఫిడేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ అధ్యక్షురాలు రాధిక, సాదినేని యామిని శర్మ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లౌకికవాద పరిరక్షణకు వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తాం: సంతోశ్ కుమార్

న్యూఢిల్లీ: లౌకికవాదాన్ని పరిరక్షించడం కోసం వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ తెలిపారు. వక్ఫ్ బిల్లు కేవలం మతానికి సంబంధించినది కాదని, లౌకికవాదంతో ముడిపడి ఉన్నదన్నారు. వక్ఫ్ బిల్లు ద్వారా మతం పేరిట సమాజాన్ని విభజించడమే బీజేపీ ముఖ్య ఉద్దేశమని దుయ్యబట్టారు. అందుకోసమే అన్ని పార్టీలు దీనిని వ్యతిరేకించాలన్నారు. చట్టసభల్లో ప్రతిపక్షాలను మాట్లాడనివ్వడం లేదని బీజేపీ తీరును సంతోశ్ కుమార్ ఆక్షేపించారు. విపక్ష సభ్యుల సలహాలు, సూచనలు తీసుకోవడాన్ని కూడా మానేసిందని, ప్రజల తరఫున డిమాండ్లు చేయనివ్వడం లేదని అన్నారు. తద్వార చాలా రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని సంతోశ్ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కాగా, ఈ బిల్లును వ్యతిరేకిస్తూ కర్నాటక, తమిళనాడు అసెంబ్లీలు ఇప్పటికే తీర్మానించాయి. ముస్లింలను వారి మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, శ్మశానాలు, స్వచ్ఛంధ సంస్థల నుంచి దూరం చేసే కుట్రగా వక్ఫ్ బిల్లును ఆలిండియా ముస్లిం పర్సనల్ బోర్డు (ఏఐఎంపీబీ) దుయ్యబట్టింది. శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన విషయం విదితమే.

ఈకేవైసీ నమోదు గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రేషన్ కార్డుదారుల ఈకేవైసీ నమోదుకు పౌరసరఫరాలశాఖ ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించింది. తొలుత ఈ నెల 31 వరకే సమయం ఉందని అధికారులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ఈకేవైసీ నమోదు చేసుకోలేకపోయారు. దీంతో గడువు పొడిగించాలని కార్డుదారుల నుంచి డిమాండ్ రావడంతో ప్రభుత్వం గడువును పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలని రాష్ట్రాలను కేంద్రం ఇటీవల ఆదేశించింది.

'ఎల్ 2 ఎంపురాన్'పై ఆర్‌ఎస్‌ఎస్ విషం

హిందూ వ్యతిరేక చిత్రమని విమర్శ

తిరువనంతపురం: స్టార్ నటుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం వివాదంలో చిక్కుకున్నది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఈ సినిమాను హిందూ వ్యతిరేక చిత్రంగా అభివర్ణించింది. కాంగ్రెస్ ఈ చిత్రానికి మద్దతు ప్రకటించగా... బీజేపీ మాత్రం మిన్నకుండిపోయింది. ఎంపురాన్ చిత్రం ఈ నెల 27న విడుదలైంది. ప్రేక్షకుల ఆదరణ లభించింది. ఎల్ 2 ఎంపురాన్‌పై ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. ఆర్‌ఎస్‌ఎస్ అధికారిక పత్రిక ఆర్గనైజర్‌లో ప్రచురించిన కథనం ప్రకారం... ఈ చిత్రం 2002 గోధ్రా అల్లర్ల నేపథ్యాన్ని ఉపయోగించి హిందూ వ్యతిరేక రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకువస్తుందని ఆరోపించింది. ఈ సినిమా కథ హిందువులను కించపరచడమే కాకుండా... ప్రత్యేకంగా హిందూ అనుకూల రాజకీయ భావజాలాలను లక్ష్యంగా చేసుకుంటుందని చెప్పుకొచ్చింది. హిందూ వ్యతిరేక, బీజేపీ వ్యతిరేక కథనాన్ని వ్యాప్తి చేయడానికి ఇది ఒక మాధ్యమమని, వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని మండిపడింది. భారతదేశం సహా ఉపఖండంలో జరుగుతున్న మారణహోమం మధ్య హిందువులను విలన్లుగా చిత్రీకరించే హిందూ వ్యతిరేక ప్రచార చిత్రం ఎంపురాన్ అని ఆక్షేపించింది. బీజేపీ కేరళ ప్రధాన కార్యదర్శి పి.సుధీర్ మాట్లాడుతూ ఈ చిత్రం తన దారిలో వెళ్తుందని, పార్టీ సైతం తన పని తాను చేసుకుంటుందన్నారు. ఈ సినిమాతోనే పార్టీ ప్రభావితం కాదని, సంఘ్‌కు తమ అభిప్రాయాలు వ్యక్త పరిచే హక్కు ఉందని, అది మంచి చిత్రమా? లేదా? అన్నది నిర్ణయించుకునే హక్కు ప్రేక్షకులకు ఉందని అన్నారుపీ చిత్రానికి కేరళ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, పలక్కాడ్ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కుట్టతిల్ మద్దతు ప్రకటించారు. కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ వంటి నిరాధారమైన అబద్ధాలు, మతపరమైన ద్వేషాలతో కూడిన చిత్రాలకు సంబంధించి భావ ప్రకటనా స్వేచ్ఛను సమర్థించే వ్యక్తులు... ఇప్పుడు ఎంపురాన్‌ను వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు, చిత్ర నిర్మాత పురస్కారానికి అర్హుడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి దివంగత కొడియేరి బాలకృష్ణన్ కుమారుడు, నటుడు బినీశ్ కొడియేరి పేర్కొన్నారు.

వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదు

ఆర్‌జీకార్ కేసులో సీబీఐ నివేదిక

కోల్‌కతా: ఆర్‌జీకార్ వైద్య కళాశాల జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య కేసుపై విచారణ జరుపుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ కోల్‌కతా హైకోర్టుకు తన నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదని పేర్కొంది. దర్యాప్తులో భాగంగా సేకరించిన అన్ని ఆధారాలు, నిపుణుల అభిప్రాయాలు వైద్యురాలిపై జరిగింది సామూహిక అత్యాచారం కాదని సూచిస్తున్నాయని స్పష్టం చేసింది. సీబీఐ తరఫున న్యాయవాది డిప్యూటీ సొలిసిటర్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్... ఘటనాస్థలం నుంచి సేకరించిన అన్ని డీఎన్‌ఏ నమూనాలకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా వైద్యులతో కూడిన 14 మంది సభ్యుల మెడికల్ బోర్డు ఈ పరీక్ష ఫలితాలను పరీక్షించిందన్నారు. ఏ ఫోరెన్సిక్ ఆధారాలు కూడా సామూహిక అత్యాచారం జరిగినట్లు నిర్ధారించలేదని స్పష్టం చేశారు. డీఎన్‌ఏ ప్రొఫైలింగ్ దోషిగా తేలిన నిందితుడు సంజయ్ రాయ్ ప్రమేయాన్ని మాత్రమే నిర్ధారించినట్లు కోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాలు నాశనం చేయడంతో పాటు పలువురి అధికారుల ప్రమేయం ఉందనే ఆరోపణలపై విచారణ జరుగుతోం దన్నారు. కాగా, 2024 ఆగస్టు తొమ్మిదిన కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రి సమావేశపు గదిలో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా సంజయ్ రాయ్‌ని ఆగస్టు 10న పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును సీబీఐ విచారించింది. ప్రధాన నిందితుడిగా సంజయ్ రాయ్ పేరును ఛార్జ్‌షీట్‌లో చేర్చి కోర్టుకు సమర్పించింది. దీనిపై విచారణ జరిపిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారించింది. అతడికి జీవితఖైదు విధిస్తూ ఈ ఏడాది జనవరి 20న తీర్పు వెలువరించింది. బాధిత కుటుంబానికి రూ.17లక్షల పరిహారం ఇవ్వాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పుపై బాధిత కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలంటూ వైద్యురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఐఆర్‌సీటీసీ నుంచి విముక్తి చేయండి

కోర్టుకు లాలూ రాబ్డీ, తేజస్వి వినతి

న్యూఢిల్లీ : ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) లో 2004-2014 మధ్య జరిగిన అవినీతి కేసులో తమను విడుదల చేయాలని ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్, అతని భార్య రాబ్డీ దేవి, వారి కుమారుడు తేజస్వి యాదవ్ శనివారం కోర్టును కోరారు. ఈ ముగ్గురు ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే ముందు వాదనలు వినిపించారు. సీబీఐ కేసు ఉద్దేశపూర్వకంగా, ప్రేరేపితంగా ఉన్నాయని, తమపై వచ్చిన ఆరోపణలు 'తప్పుడువని' పేర్కొన్నారు. ఈ కేసులో అభియోగాల రూపకల్పనపై వాదనల సందర్భంగా నిందితులు సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్‌కు సమర్పించారు. నేరపూరిత కుట్ర, మోసం, అవినీతితో సహా వివిధ నేరాలకు గాను వారు గరిష్ఠంగా ఏడేళ్ల జైలు శిక్షను మోపారు. తమపై సీబీఐ

మోపిన ఆరోపణలు అవాస్తవమని, ప్రేరేపితమని, ఈ కేసులో తమపై విచారణ జరిపేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ వద్ద ఆధారాలు లేవని ఈ ముగ్గురు నేతలు న్యాయమూర్తి ముందు పేర్కొన్నారు. ఈ కేసు విచారణ ఏప్రిల్ 21న తిరిగి ప్రారంభమవుతుంది. ఎ-1 నుంచి ఎ-4 (లాలూ, రాబ్డీ, తేజస్వి, లారా ప్రాజెక్ట్స్ ఎల్‌ఎల్‌పీ) తరఫున వాదనలు వినిపించారు. తదుపరి సమర్పణల కోసం ఉంచండి అని న్యాయమూర్తి చెప్పారు. ప్రభుత్వ హయాంలో రైల్వే మంత్రిగా పని చేసిన లాలూ ప్రసాద్ గతంలో ఈ కేసులో తనను విచారించేందుకు సీబీఐ పొందిన ఆంక్షల చెల్లుబాటును ప్రశ్నించారు. నిందితులను విచారణ చేయడానికి తగిన సాక్ష్యాలు ఉన్నాయని ఫిబ్రవరి 28న దర్యాప్తు సంస్థ కోర్టుకు తెలిపింది. రెండు ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ ఒప్పందాలను ఒక ప్రైవేట్ సంస్థకు మంజూరు చేయడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈ కేసు వచ్చింది.

భావితరాలకు కాలుష్యరహిత

పర్యావరణాన్ని అందిద్దాం: జస్టిస్ నాథ్

న్యూఢిల్లీ: భావితరాలకు వాయు, నీటి కాలుష్యం లేని పర్యావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ నొక్కిచెప్పారు. కాలుష్యాన్ని అరికట్టడం కోసం వాయు శుద్ధీకరణ సాంకేతికతల వినియోగం, ఉద్గారాల నియంత్రణ అనివార్యమని అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించడం మన కర్తవ్యమన్నారు. బయట ఆడుకోవడానికి వెళ్లాలంటే మాస్కులు ధరించాల్సిన పరిస్థితి పిల్లలకు రానివ్వద్దని సూచించారు. ఆర్థికవృద్ధి, పర్యావరణం అనుకూల విధానాల మధ్య సమతుల్యత అనివార్యమని జస్టిస్ నాథ్ వక్కాణించారు. హరిత సాంకేతికతలపై దృష్టి సారించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలన్నారు. దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పర్యావరణంపై జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. సదస్సులో జస్టిస్ నాథ్ మాట్లాడుతూ 'దేశ రాజధాని నగరం వాయు కాలుష్య కోరల్లో చిక్కుకొన్నది. చిన్నతనంలోనే శ్వాసకోశ సంబంధిత వ్యాధుల ముప్పు పిల్లలకు ఏర్పడింది. బయట ఆడుకోవాలంటే మాస్కు ధరించాల్సిన పరిస్థితుల్లో వారు పెరగడం ఆందోళనకరం. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు.

కాలుష్యాన్ని అరికట్టేందుకు సత్వర చర్యలు అనివార్యమన్నారు. మనం పీల్చే గాలి విషయంలో రాజీ పడకుండా ఆర్థిక పురోగతి సాధించడానికి ఉన్న అవకాశాలను అన్వేషించడం ముఖ్యమని సూచించారు. అలాగే, సుస్థిర రవాణా, శుద్ధీకరణ సాంకేతికతలపై దృష్టితో ఉద్గారాల నిరోధానికి సమష్టిగా కృషి చేయాలని జస్టిస్ నాథ్ పిలుపునిచ్చారు. నీటి కాలుష్యం ఓ విపత్తుగా మారుతోందని హెచ్చరించారు. దీనిని అరికట్టడం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో పర్యావరణ సంబంధిత నిర్ణయాలు తీసుకుంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ చేస్తున్న పనిని జస్టిస్ నాథ్ మెచ్చుకున్నారు. ఆరోగ్యకర వాతావరణానికి రాజ్యాంగం ఇచ్చే హామీకి న్యాయ వ్యవస్థ కట్టుబడి ఉందని నొక్కిచెప్పారు. 'ప్రకృతి కాపాడితే... మనలను మనం కాపాడుకున్నట్లే. ఐక్యతా స్ఫూర్తి, బాధ్యతతో అది ముడిపడి ఉంటుంది. సుస్థిరాభివృద్ధి, పర్యావరణ సామరస్యతకు ప్రతీకగా భారత్ నిలవగలిగే భవిష్యత్ కోసం కలిసికట్టుగా పనిచేయాలని ప్రతీ ఒక్కరినీ కోరుతున్నా' అని జస్టిస్ నాథ్ అన్నారు. కాగా, జాతీయ హరిత ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాత్సవ, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తదితరులు ప్రసంగించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయానికి 'కొలికపూడి' పంచాయితీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయానికి తిరువూరు పంచాయితీ చేరింది. తిరువూరు టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా తిరువూరు నియోజకవర్గ నేతలు ఐక్యమయ్యారు. టీడీపీ నేత రమేశ్ రెడ్డికి అనుకూలంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. డౌన్ డౌన్ కొలికపూడి, తిరువూరుకు కొలికపూడి వద్దు అంటూ టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. వీరిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సముదాయించారు. తిరువూరు ముఖ్య నేతలతో పల్లా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... పార్టీయే సుప్రీం, గీతదాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంతటి వారైనా చర్యలకు వెనకాడబోమని అన్నారు. కార్యకర్తల అభిప్రాయాలను అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కొలికపూడిపై ఆరోపణలు చేస్తున్న రమేశ్ రెడ్డి వ్యవహారం తమ దృష్టికి రాలేదని పల్లా తెలిపారు. రమేశ్‌రెడ్డిపై ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని అన్నారు. కుటుంబంలో చిన్న చిన్న కలహాలు ఉంటాయని, తిరువూరు వ్యవహారం కూడా అలాంటిదేనని అన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రమేశ్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే తాను రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇటీవల బహిరంగంగా ప్రకటించడం పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది.

'క్యాష్ ఎట్ జడ్జ్ డోర్' కేసులో

జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు ఊరట

న్యూఢిల్లీ: రిటైర్డ్ జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు చండీగఢ్ సీబీఐ కోర్టులో ఊరట లభించింది. 2008 నాటి 'క్యాష్ ఎట్ జడ్జ్ డోర్' కేసులో జస్టిస్ యాదవ్‌తో పాటు మరో ముగ్గురిని నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. వారిపై నేరాభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. నిర్దోషులుగా ప్రకటించిన వారిలో హోటల్ యజమాని రవీందర్ సింగ్, రాజీవ్ గుప్తా, నిర్మల్ సింగ్ ఉన్నారు. నిందితుల్లో ఒకరైన హర్యానా మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ సంజీవ్ బన్సాల్ విచారణ సమయంలో మరణించారు. 2008లో పంజాబ్, హర్యానా హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటికి పొరపాటున రూ.15 లక్షల సంచి చేరడంతో ఈ కేసు ప్రారంభమైంది. జస్టిస్ కౌర్ ఇంట్లో గుమస్తా అమ్రిక్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం, ఆగస్టు 13, 2008న రాత్రి 8.30 గంటలకు ప్రకాశ్ రామ్ అనే వ్యక్తి ఓ ప్లాస్టిక్ సంచితో జస్టిస్ యాదవ్ ఇంటికి వచ్చి... జస్టిస్ కౌర్ కోసం దిల్లీ నుంచి కేసు పత్రాలు వచ్చాయని చెప్పాడు. అమ్రిక్ సింగ్ ఆ సంచిని తీసుకొని లోపల పెట్టారు. అనంతరం జస్టిస్ యాదవ్‌కు విషయం తెలిజేయగా తెరిచి చూడటమని న్యాయమూర్తి చెప్పడంతో సంచిని తెరిచాడు. అందులో డబ్బులు ఉండటాన్ని గుర్తించాడు. ఆ వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ప్రకాశ్ రామ్‌ను, నగదు సంచిని అదుపులోకి తీసుకున్నారు.

2008 ఆగస్టు 16న ఎఫ్ఐఆర్ నమోదు కాగా చండీగఢ్ ప్రభుత్వం 26వ తేదీన సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దర్యాప్తు పూర్తి చేసిన 2011, ఏప్రిల్ 18న చార్జిషీట్‌ను సీబీఐ దాఖలు చేసింది. జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు పంపాల్సిన సంచి పొరపాటున జస్టిస్ కౌర్ ఇంటికి చేరినట్లు వెల్లడించింది. పేర్లలో సారూప్యత కారణంగా తప్పిదం జరిగినట్లు పేర్కొంది. హోటల్ యజమాని రవీంద్ర సింగ్ ఈ డబ్బును జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు 2008, ఆగస్టు 13న పంపాల్సి ఉండగా, నగదును దిల్లీలో సంజీవ్ భన్సల్‌కు అందజేస్తే... ఆయన దగ్గర నుంచి ఆ డబ్బు జస్టిస్ యాదవ్‌కు చేరాలి కానీ అది పొరపాటున జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటికి చేరినట్లు సీబీఐ వివరించింది. 2014 జనవరి 18న ప్రత్యేక కోర్టు నిందితులపై అభియోగాలు నమోదు చేసింది. జస్టిస్ యాదవ్ తరఫు న్యాయవాది విశాల్ గార్గ్ నర్వానా, సీబీఐ ఆమెను ఈ కేసులో ఇరికించిందన్నారు. అయితే సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. చివరకు సత్యమే గెలిచిందని విడుదల అనంతరం మీడియాతో మాట్లాడిన జస్టిస్ నిర్మల్ యాదవ్ అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.